


ఐటీసీ ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ హవా

- 60 ఓట్ల మెజారిటీతో ఐఎన్‌టీయూసీపై విజయం
- టీఎన్‌టీయూసీకి 480 ఓట్లు, ఐఎన్‌టీయూసీకి 420...
- మొత్తం 1,253 ఓట్లకు గాను 1252 ఓట్లు పోల్
- కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం: అధ్యక్షుడు హరిప్రసాద్
- ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారం ఎదుట హోరెత్తిన సంబురాలు

6



కూలీల ట్రాక్టర్ బోల్తా

- మహిళ దుర్మరణం.. 23 మందికి గాయాలు
- మిరప కోతలకు వెళ్తుండగా బోనకల్ శివారులో ఘటన
- క్షతగ్రాతులకు మెరుగైన వైద్యం అందించాలన్న డిప్యూటీ సీఎం భట్టి
- బాధితులంతా బోనకల్ వారే...

7

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం



- నేటి నుంచి మార్చి 20 వరకు ప్రతీ రోజు సాయంత్రం అమలు
- ప్రత్యేక తరగతులకు హాజరయ్యే వారికి మాత్రమే
- జిల్లాలో 6,400 మంది విద్యార్థులకు లబ్ధి
- ఒక్కొక్కరికి రూ.15 ఖర్చు

12

వరాలు కురిసేనా!?

నేటి కేంద్ర బడ్జెట్‌పై భిన్న వర్గాల్లో ఎన్నో ఆశలు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాపై వరాల వాన కురుస్తుందని ప్రజలు ఆశతో వున్నారు. తెలంగాణ, ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిసాకు సరిహద్దు కారిడార్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా అభివృద్ధి కేంద్ర నిధులపైనే ముడిపడి ఉంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిఏటా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర విభజన చట్టం హామీల్లో కీలకంగా ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు రాష్ట్ర నినాదంగా ఉంది. ప్రతిసారి పార్లమెంట్ సభ్యులు సమావేశాల్లో ప్రస్తావించడం, రాష్ట్ర ప్రభుత్వం కూడా వత్తిడి తేవడం తప్ప కేంద్రం నుంచి స్పష్టత రావడంలేదు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేస్తే ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లా యువతకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి. దీనికి సంబంధించి గతంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్వే చేసి కొంత ప్రతిపాదన కూడా చేసింది.



ఖమ్మం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గంగానది వలే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి నది ప్రవహిస్తున్నది. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలకు తలమానికంగా ఉన్న గోదావరి నదిని జాతీయ జలమార్గంగా చేయాలని బ్రిటీష్‌కాలంనుంచి కసరత్తు జరుగుతోంది. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో దుమ్ముగూడెం వద్ద ఆనకట్ట కట్టి మహారాష్ట్రలోని చిరువంచ నుంచి రాజమండ్రి వరకు గోదావరి జలమార్గంగా చేసుకుని కలపతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు కూడా రవాణా చేశారు. జన రవాణా కూడా జలమార్గంతో అప్పట్లోసాగింది. రోడ్డు రవాణా , రైలు రవాణా అందుబాటులోకి రావడంతో జలమార్గం కాలక్రమేణా కనుమరుగైంది. గోదావరి వరద కూడా వేసవికాలంలో తగ్గుముఖం పట్టడంతో జలరవాణా స్తంభించిది. అయితే ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు రవాణా ఖర్చులను దృష్టిలో పెట్టుకుని గోదావరిని జలమార్గంగా అభివృద్ధి చేసి సముద్ర మార్గానికి కాకినాడకు అనుసంధానం చేసే ప్రతిపాదన ఉంది. బడ్జెట్ సమావేశాల్లో దీనిపై ఏమైనా ప్రకటన ఉంటుందన్న ఆశ ప్రజల్లో ఉంది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నందున గోదావరి ఎగువన సీతమ్మసాగర్, సమ్మక్కసారక్కసాగర్, తుమ్మిడిహట్టి, కాళేశ్వరం డ్యామ్‌లతో జలమార్గానికి అనువుగా ఉంది. అలాగే గంగానది జలకాలుష్య నివారణ వలే గోదావరిని జాతీయ కాలుష్య నివారణ కోసం కేంద్రం గతంలో ప్రతిపాదనలు చేసింది. మంచిర్యాల, భద్రాచలం, రాజమండ్రిలో కొంత మురికినీరు రాకుండా తాత్కాలిక చర్యలు అప్పట్లో చేపట్టారు. తర్వాత ఈ ప్రాజెక్టు మరుగున పడింది. కేంద్ర బడ్జెట్ (మిగతా 6వ పేజీలో)

కొవ్వూరు రైల్వేలైన్ పట్టాలెక్కేనా!?


- సర్వే పూర్తయినా ఆశించిన మేర జరగని నిధుల కేటాయింపులు
- ఈ సారి బడ్జెట్‌లోనైనా దక్కుతాయని ఆశ
- సింగరేణి కొత్త బొగ్గు బావులకు అనుమతులు దక్కేనా?
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు పచ్చజెండా ఊపేనా?

కొత్తగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే సాధారణ బడ్జెట్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. భద్రాచలం రోడ్ (కొత్తగూడెం రైల్వేస్టేషన్)-కొవ్వూరు రైల్వేలైన్ మంజూరైనప్పటికీ గత పదేళ్ల నుంచి రైల్వేలైన్ నిర్మాణానికి బడ్జెట్‌లో అరకోర నిధులు తప్ప ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించడం లేదు. దీంతో నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ఈసారి బడ్జెట్‌లోనైనా ఈ రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కొవ్వూరు నుంచి భద్రాచలం రోడ్ వరకు రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేసిన నేపథ్యంలో భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి సత్తుపల్లి వరకు 49 కిలో మీటర్లు సింగరేణి సంస్థ అందించిన (మిగతా 6వ పేజీలో)

- గోదావరి జలమార్గం పునరుద్ధరణ, కాలుష్య నియంత్రణ...
- జాతీయ రహదారుల అభివృద్ధి పనులు...
- 'విభజన' చట్టంలోని బయ్యారం ఉక్కు పరిశ్రమ..
- నిధుల కేటాయింపు జరిగితేనే కదలిక సాధ్యం
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వైపు అందరి చూపు


వాగ్గేయకార ఉత్సవాలు నిర్వహించే వేదిక



రామజోగి మందు కొనరే.. ఓ జనులారా!

- నేటి నుంచి భక్త రామదాసు జయంతి, ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాలు
- ఐదు రోజుల పాటు సాగనున్న కార్యక్రమాలు
- కీర్తనలను ఆలపించనున్న ప్రముఖ సంగీత కళాకారులు
- తొలిసారి యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం

భద్రాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జగదభిరాముడు శ్రీరాముడికి స్వరనీరాజనం పలికే సమయం రానే వచ్చింది. వాగ్గేయకారుల హృదయాంతరాల్లోంచి పరిమళించిన కీర్తనలను మరోసారి ఆలపించి ఓలలాడింప చేసేందుకు భద్రాద్రి ముస్తాబైంది. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తరామదాసు 392వ జయంతి, ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాలు శనివారం నుంచి నేత్రపర్వంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను ఈవో ఎల్.రమాదేవి ప్రారంభించనుండగా శ్రీచక్ర సిమెంట్స్ ఛైర్మన్ నేంద్రగంటి కృష్ణమోహన్, విజయ్‌కుమార్, ప్రముఖ సంగీత కళాకారులు మల్లాది సూరిబాబు, మల్లాది బ్రదర్స్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాలను తొలి రోజున శ్రీచక్ర సిమెంట్స్, మిగిలిన నాలుగు రోజులు భద్రాద్రి దేవస్థానం నిర్వహించనున్నారు.

'రామజోగి మందు కొనరే! ఓ జనులారా...' అంటూ రామదాసు రచించిన కీర్తన ఎంతో ప్రసిద్ధమైనది. ఈ కీర్తనను ప్రతిబింబించే వాతావరణం ఇప్పుడు భద్రాద్రిలో నెలకొని ఉంది. 'రామ జోగి మందును మీరు స్వీకరించండి... ప్రేమతో స్వీకరించినట్లయితే కామ క్రోధాలన్నీ దూరమవుతాయి. కాటుక కొండల వంటి పాపాలను ఈ మందు రూపుమాపుతుంది...' అని ఈ కీర్తన భావం. ఇట్లాంటి వందలాది కీర్తనలు భద్రాచలానికి వీనుల విందు చేయనున్నాయి.

రామున్ని కీర్తించని వాగ్గేయకారుడు లేరు

వాగ్గేయకారులు ఎందరో తమ జీవిత కాలంలో అత్యధిక భాగం స్వామి నామస్మరణకే కేటాయించి తరించారు. త్యాగయ్య, అన్నమయ్య, క్షేత్రయ్య, భక్తరామదాసు, తూము నరసింహదాసు, శ్యామశాస్త్రి, పురంధర దాసు, ముత్తుస్వామి దీక్షితార్‌లు భగవంతుని స్మరణ చేస్తూ ఎన్నో కీర్తనలను స్వయంగా రచించి గానం చేసి చరిత్రలో వాగ్గేయకారులుగా నిలిచారు. ముఖ్యంగా (మిగతా 6వ పేజీలో)

ముస్తాబైన ధ్యాన మందిరం

- నేలకొండపల్లిలో భక్త రామదాసు జయంతి ఉత్సవాల సందడి
- పట్టు వస్త్రాలు సమర్పించిన వంశీకుడు కంచర్ల శ్రీనివాసరావు

నేలకొండపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భక్త రామదాసు జయంతి ఉత్సవాలకు నేలకొండపల్లిలోని భక్త రామదాసు ధ్యాన మందిరం ముస్తాబైంది. శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు గోపూజతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామి వార్లకు, రామదాసుకు అభిషేకాలు, పూజాదికాలు నిర్వహిస్తారు. నగర సంకీర్తన అనంతరం భక్తరామదాసు కాంస్య విగ్రహానికి భద్రాచలం దేవస్థాన వేద పండితులతో అభిషేకం చేస్తారు. ఉదయం 10 గంటలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా జయంతి ఉత్సవాల ప్రారంభోత్సవ సభ (మిగతా 6వ పేజీలో)


రామదాసుకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కంచర్ల శ్రీనివాసరావు

ఎస్సీ వర్గీకరణ అమలుపై దొంగాట

- సుప్రీంకోర్టు తీర్పునూ బేఖాతర్ చేస్తున్నారు
- మాదిగలకు అన్నిచోట్లా అన్యాయమే చేస్తున్నారు
- కాంగ్రెస్‌పై మాజీ ఎమ్మెల్యే సండ్ర ఫైర్

ఖమ్మం జనవరి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో మాదిగ రిజర్వేషన్ అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దొంగాట ఆడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అన్యాయం చేస్తోందని, ఇప్పటికైనా ఎస్సీ రిజర్వేషన్ అమలుచేసి మాదిగలకు సామాజిక న్యాయం చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులే పోటీ సభలు పెడుతున్నారని, వారిపై కాంగ్రెస్ పార్టీ ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరి అవలంభిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు ఎలాంటి కార్యాచరణ చేయడంలేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి చూస్తుంటే ఎస్సీ వర్గీకరణ విషయంలో పూర్తి వ్యతిరేక వైఖరి అవలంభిస్తుందని, మాదిగలకు సైతం రాష్ట్రంలో పదవులు ఇవ్వడం లేదన్నారు.

రాష్ట్రంలో డిప్యూటీ సీఎం పదవితోపాటు ఖమ్మం జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలు మాలలకే కేటాయించారని, ఇది మాదిగలకు ద్రోహమేనన్నారు. కీలకమైన డిప్యూటీ స్పీకర్ పదవి మాలలకే కేటాయించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దళితబంధు రద్దయిందని, ఎస్సీ సబ్ ప్లాన్‌ను నిర్వీర్యం చేశారని, ఎస్సీ కార్పొరేషన్‌లో నిధుల కేటాయింపులేదని పేర్కొన్నారు.



ఖమ్మంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

125 అడుగుల అంబేద్కర్ విగ్రహం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేస్తే ఆ విగ్రహాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి దళితుల అభ్యున్నతికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, ఖమ్మంరూరల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, బొమ్మెర రామ్మూర్తి, బిచ్చాల తిరుమలరావు పాల్గొన్నారు.

అడ్రస్ లేని కాంగ్రెస్ హామీలు

- కాంగ్రెస్ వెబ్‌సైట్‌లోనూ కేసీఆర్‌కే మెజారిటీ ఓట్లు
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య
- ఘనంగా సత్తుపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్ అభినందన సభ

12

దొంగ అసెస్‌మెంట్లపై చర్యలేవీ?

విజిలెన్స్ ఆదేశాలకూ స్పందించని కేఎంసీ అధికారులు

ఖమ్మం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులైతే ఏంటి? విజిలెన్స్ అధికారులు అయితే మాకేంటి? అన్న విధంగా ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) పరిధిలోని కొందరు అధికారుల తీరు ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ ఆదేశాలకు అనుగుణంగా విచారణ నివేదిక పంపేందుకు కార్పొరేషన్ అధికారుల నుంచి వివరణ కోరినా.. ఎలాంటి స్పందన లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ విభాగంలోని కొందరు అధికారులు అందినకాడికి దండుకుని దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారానికి తెర లేపారన్న ఆరోపణలు వచ్చాయి. పదుల కొద్దీ దొంగ అసెస్‌మెంట్లు వేసి ఇంటి నెంబర్లు కేటాయించిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటిని ఆధారంగా చేసుకుని అక్రమార్కులు 58, 59 జీవోల పేరుతో స్థలాల క్రమబద్ధీకరణలోనూ అక్రమాలకు పాల్పడ్డారన్న విషయం స్పష్టమైంది. కాగా ఆయా అసెస్‌మెంట్లలో జరిగిన అక్రమాలపై గతేడాది అక్టోబరులో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డైరెక్టర్ నుంచి కార్పొరేషన్ అధికారులకు విచారణ నిర్వహించి రిపోర్టు పంపాలని ఆదేశించారు. కాగా ఆయా ఆదేశాలకు అనుగుణంగా కేఎంసీలోని ఏఎంసీ విచారణ నిర్వహించేందుకుగాను సంబంధిత రెవెన్యూ సెక్షన్‌లో వేసిన అసెస్‌మెంట్ల వివరాలను సమర్పించాలంటూ లేఖ రాశారు. కాని సదరు లేఖకు ఎలాంటి స్పందన లేకపోవడంతో మరోసారి కూడా లేఖ రాసినట్టు సమాచారం. కానీ కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు మాత్రం అసెస్‌మెంట్లలో అక్రమాలకు పాల్పడిన అధికారులను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దొంగ అసెస్‌మెంట్లు వేశారనడానికి గతంలో ప్రభుత్వ భూమికి అసెస్‌మెంట్లు వేసిన సంఘటనపై కేసు నమోదు కావడంతోపాటు, తాజాగా బయటికొచ్చిన మరికొన్ని సంఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. దొంగ అసెస్‌మెంట్లు వేసిన వారిపై చర్యలు చేపట్టని కారణంగానే.. ఆ తర్వాత కాలంలో పెద్దమొత్తంలో అసెస్‌మెంట్లు వేసినట్టుగా తెలుస్తోంది.

'గూడెం' ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్!?

పది రోజుల్లో నిర్ణయం వెలువడుతుందన్న మంత్రి తుమ్మల



కొత్తగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం జిల్లా కేంద్రానికి సమీపంలోని రామవరం గరీబ్‌పేట గ్రామాల మధ్యలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు 10 రోజుల్లో క్లియరెన్స్ రానుంది. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ధృవీకరించారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు సాధ్యాసాధ్యాలపై జనవరి 23న ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో కేంద్ర విమానాయనశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో శుక్రవారం మంత్రి తుమ్మల చర్చించారు. స్థలం క్లియరెన్స్ అంశంపై కూలంకషంగా చర్చించేందుకు త్వరలో ఢిల్లీ వెళ్తున్నట్టు మంత్రి వెల్లడించారు. మరో పది రోజుల్లో సానుకూల నిర్ణయం వెలువడుతుందని తెలిపారు.

ఐటీసీ ఎన్నికల్లో
టీఎన్‌టీయూసీ జయకేతనం

60 ఓట్ల మెజార్టీతో విజయం

బూర్గంపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండలం పరిధిలోని సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో శుక్రవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ మిత్రపక్షాలు జయకేతనం ఎగురవేశాయి. 14వ వేతన ఒప్పందం కోసం జరిగిన ఈ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీ యూసీ, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్, బీఆర్‌టీయూ, టీఈయూ యూనియన్లు బరిలో నిలిచాయి. ఇందులో ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూల మధ్య పోటాపోటీగా పోలింగ్ జరిగింది. ఉదయం నుంచి ఐటీసీ పరిపాలన భవనంలో జరిగిన పోలింగు కేంద్రాల్లో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని ఓటుహక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఓటింగ్ సరళి మందగించినప్పటికీ మళ్లీ మూడు గంటల నుంచి ఊపందుకుంది. మొత్తం 1,253 ఓట్లకు గాను 1252 మంది కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేవలం ఒక కార్మికుడు ఓటు హక్కును వినియోగించుకోలేకపోయాడు.

రసవత్తర పోరు

ఐటీసీలో శుక్రవారం జరిగిన ఎన్నికలు రసవత్తరంగా మారాయి. మిత్రపక్షాల మద్దతుతో బరిలో నిలిచిన ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోలింగు సాగింది. ఈ క్రమంలో కార్మికులు సైతం తమ ఓటును ఎవరికి వేస్తున్నారో అంతు చిక్కని విధంగా ఉండటంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ఉత్కంఠకు గురయ్యారు. ఈ ఎన్నికల్లో 1252ఓట్లు పోలవగా ఇందులో టీఎన్‌టీయుసీకి 480, ఐఎన్‌టీయూసీకి 420, టీఆర్‌టీయూకి 310, బీఎంఎస్‌కి 21, టీఈయూకి 18 ఓట్లు పోలయ్యాయి. కాగా మూడు ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. ఐఎన్‌టీయూసీపై టీఎన్‌టీయూసీ 60 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. ఇందుకు గాను అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి ప్రారంభమైన కౌంటింగ్ కార్మికుల్లో మరింత ఉత్కంఠను రేపింది. ఎట్టకేలకు టీఎన్‌టీయూసీనే విజయం వరించింది.

కార్మిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల

కార్మిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఐటీసీలో పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి టీఎన్‌టీయూసీ కృషి చేస్తోందని తెలిపారు. కాంట్రాక్టు ఉపాధి కోసం పని చేస్తామని తెలిపారు. పరిశ్రమ బాగుండాలని పరిశ్రమ ద్వారా కార్మికులకు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించేలా తమ యూనియన్ పని చేస్తుందన్నారు. మిత్రపక్షాల మద్దతుతో తాము విజయం సాధించామని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కిన నరసింహులు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకె బోస్, ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, రత్నాకర్‌లకు హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.


జయకేతనం చూపిస్తున్న దృశ్యం

విజయం ఊహించిందే

టీఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ

ఐటీసీ ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ విజయం సాధిస్తుందని తాము ముందుగానే ఊహించామని రాష్ట్ర జనరల్ సెక్రటరీ పోటు రంగారావు అన్నారు. కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ విజయం సాధించిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లడారు. కార్మికులు టీఎన్‌టీయూసీ పక్షాన నిలిచారని వారి సమస్యలను పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేస్తామన్నారు.

ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు

ఐటీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. డీఎస్పీ సతీష్‌కుమార్ పర్యావేక్షణలో పాల్వంచ, అశ్వారావుపేట సీఐలు సతీష్‌కుమార్, కరుణాకర్, పాల్వంచ సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, సుమారు 80మంది సిబ్బందితో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించారు.

గిరిజనులకు పథకాలు అందేలా చూడాలి

ఐటీడీఏ అధికారులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ద్వారా ప్రవేశపెడుతున్న వివిధ రకాల జీవనోపాధి పథకాలను గిరిజన కుటుంబాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏలో శుక్రవారం పీవో బి.రాహుల్‌తో కలిసి ఐటీడీఏ యూనిట్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీసీసీ ద్వారా గిరిజనుల నుంచి సేకరించే అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయడంతోపాటు గిరిజనులు వాటిని మార్కెటింగ్ చేసుకునేలా డీఆర్ డిపోల పరిధిలో ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వేసవి సెలవుల్లో ఇప్ప మొక్కలు నాటించి ప్లాంటేషన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్లలో గ్రైండర్, స్టీమ్ కుక్కర్లు రిపేరు చేయించాలని, కరెంటు అవసరం ఉన్నచోట సోలార్ ప్యానల్ ద్వారా కరెంటు సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన యువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి పొందేలా చూడాలని, జాబ్ కార్డు హోల్డర్లకు ఈజీఎస్ ద్వారా 100రోజుల పని తప్పనిసరిగా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో రాంబాబు, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, డీటీఆర్‌వో ఎఫ్‌ఆర్ లక్ష్మీనారాయణ, జీసీసీ డీఎం సమ్మయ్య, ఏపీవో పవర్ వేణు, ఎస్డీసీ ఉదయ్‌కుమార్, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.




క్యాంటిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సేంద్రియ ఎరువుల కోసం గుంతల నిర్మాణం చేపట్టాలి

ఐటీడీఏ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో చెత్తా చెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రంచేసి సేంద్రియ ఎరువులకు సంబంధించిన గుంతల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఐటీడీఏ పరిసరాలను ఆయన పరిశీలించారు.నివాస గృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు.

శిశు విహార్‌ను సందర్శించిన కలెక్టర్

భద్రాచలం బ్రిడ్జి రోడ్డులో ఉన్న శిశు గృహ అనాథ పిల్లల ఆశ్రమాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆశ్రమంలోని పరిసరాలను పిల్లలకు అందుతున్న ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అనాథ పిల్లలను, రైల్వే స్టేషన్లు, బస్టాండు, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో కాని అనాథ శిశువులు ఉన్నట్లు సమాచారం అందితే సంబంధిత అధికారులు తప్పనిసరిగా వారిని ఆశ్రమాల్లో చేర్పించాలన్నారు. కలెక్టర్ పిల్లలతో కాసేపు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో హరికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ పరిశోధన కేంద్రంలో ఇంటి దొంగలు

కోటి విలువైన వృక్ష సంపద మాయం?

అశ్వారావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని అచుతాపురం అటవీ పరిశోధన కేంద్రంలో దొంగలు పడ్డారనే ఆరోపణలు వస్తున్నాయి. మేలు రకాలైన అటవీ జాతులపై పరిశోధనలు జరిపి ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలను జాతికి అందించే మహోన్నతమైన అటవీపరిశోధన కేంద్రం అక్రమార్కులకు నిలయంగా మారింది. ఈ కేంద్రంలో దశాబ్దాల పాటు పెంచిన కోటి రూపాయల విలువైన భారీ టేకు వృక్షాలు మాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఈ అటవీ పరిశోధనలు చేసేందుకు ఈ కేంద్రంలో దేశ, విదేశాల్లోని వివిధ రకాలైన మదర్ ప్లాంట్‌లను పదుల ఎకరాల్లో నాలుగు దశాబ్దాల క్రితం లక్షలు ఖర్చుపెట్టి ప్లాంటేషన్‌లను పెంచారు. వీటిలో టేకు, మద్ది, బండారు, వేగీశతోపాటు ఎంతో విలువైన మారుజాతి కలప, వెదురు వృక్షాలు ఇందులో ఉన్నాయి. టేకు 20హెక్టార్లు, వెదురు మూడు హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. ఈ కేంద్రంలో మేలుజాతి అటవీ వృక్షాలతోపాటు పలు రకాలైన ఔషధ మొక్కలను అప్పట్లో వేశారు. దాదాపు రెండు దశాబ్దాలకుపైగా ప్రభుత్వాలు దీనిని పట్టించుకోకపోవడంతో పరిశోధన కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఒక ఇన్‌చార్జి రేంజ్ అధికారితోపాటు మరో ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉన్నారు. రేంజ్ అధికారి వరంగల్‌లో ఉంటారు.

కేంద్రం నిర్వహణకు నిధులు రాక పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. ఈ నేపథ్యంలో ఉన్న సిబ్బంది కేవలం ఈ కేంద్రానికి కాపలాగా ఉంటున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడం, అభివృద్ధి పనులు జరగకపోవడంతో కొందరు అక్రమార్కులు ఈ కేంద్రంలో దశాబ్దాల క్రితం వేసిన టేకు వృక్షాలు, వెదురును అక్రమంగా నరుక్కొని పోయారు. ఒక్కో టేకు చెట్టు విలువ రూ.3 లక్షలు ఉంటుందని చెపుతున్నారు. 32 చెట్లకు పైగా మాయమైనట్టు తెలుస్తోంది. దీంతోపాటు వెదురు చెట్లు మాయమయ్యాయి.



ఈ కేంద్రం చుట్టు ప్రహరీ, పకడ్బందీగా ఫెన్సింగ్ ఉండగా లోపల ఉన్న విలువైన వృక్ష సంపద ఎలా మాయమైందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో ఎవరిదైన సంబంధిత కేంద్రంలో పనిచేసే వ్యక్తుల ప్రమేయం లేకుండా ఏ విధంగా భారీ వృక్షాలు మాయమవుతాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై లోతైన విచారణ జరిపితే అసలు దొంగలు వెలుగులోకి వస్తారంటున్నారు. దీనిపై వరంగల్ డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్‌ను వివరణ కోరగా అటవీ పరిశోధన కేంద్రంలో కలప మాయం అయిన విషయమై తనకు సమాచారం లేదని, దీనిపై తక్షణమే విచారణ జరుపుతామని అన్నారు.


గవర్నర్‌ను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన జాతర కమిటీ

కరకగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో కరకగూడెం మండలం చిరుమళ్ల పంచాయతీలో జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవానికి రావాలని శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను హైదరాబాద్‌లో ఆలయ కమిటీ సభ్యులు కలిశారు. హిందూధర్మ ప్రచార కార్యదర్శి చుంచు రామకృష్ణ జాతర చారిత్రక నేపథ్యం ఆధారాలు కలిగిన సమ్మక్క, సారలమ్మ విశిష్టత, సమ్మక్క పగిడిద్దరాజుల కళ్యాణం కోయతూర్ ఇంటి వెల్పుల సమ్మేళనాన్ని గవర్నర్‌కు వివరించారు. రెండేళ్లకు ఒకసారి అత్యంత వైభవంగా జరగనున్న జాతరకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించేలా చూడాలని కోరారు. స్పందించిన గవర్నర్ ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని, సమయం చూసుకుని జాతర మహోత్సవానికి వస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొంది వెంకటరమణ, చందా భిక్షపతి, భూపతయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా సైబర్ సెక్యూరిటీ పోటీల్లో

బయాలజీ టీచర్‌కు ప్రథమ బహుమతి

మణుగూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మినిస్ట్రీస్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా స్థాయి సైబర్ సెక్యూరిటీ పోటీల్లో మండల పరిధిలోని రామానుజవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచర్‌గా పని చేసే ఉయ్యూరు వెంకట కోటేశ్వర రావు తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొని ప్రథమ బహుమతిని సాధించారు. సైబర్ నేరాలపై జాగృత పరిచే విభాగాల్లో ఈ పోటీలో పాల్గొని అత్యంత ప్రతిభను కనబర్చారు. ఫిబ్రవరి నెలలో జాతీయ స్థాయి వేదిక ద్వారా ఆయనకు అవార్డును అందజేయనున్నారు. తెలంగాణ ప్రథమ బహుమతి పొందిన కోటేశ్వరరావును మండల విద్యాశాఖ అధికారిణి స్వర్ణ జ్యోతి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నాగశ్రీ, శ్రీలత, యశోద పలువురు ఉపాధ్యాయులు హర్షంప్రకటించి అభినందించారు.


కోటేశ్వరరావు

జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు

కొత్తగూడెం క్రీడాకారుడు జశ్వంత్

చుంచుపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు కొత్తగూడెం ప్రాంతానికి చెందిన బాబూక్యాంప్ క్రీడాకారుడు ఆర్.జశ్వంత్ ఎంపికయ్యాడు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలో ముగిసిన సౌత్‌జోన్ ఫుట్‌బాల్ క్రీడాపోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు 12మంది సభ్యులతో కలిసి ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ జట్టులో స్థానం పొందాడు. జశ్వంత్ తండ్రి శ్రీనివాస్ సింగరేణి సంస్థలో కార్మికుడి పని చేస్తున్నాడు. ఆరో తరగతి చదువుతున్న కుమారుడికి క్రీడలపై ఉన్న మక్కువను గ్రహించిన తండ్రి రామవరం ప్రాంతానికి చెందిన సీనియర్ క్రీడాకారుడు, రాష్ట్ర ఫుట్‌బాల్ శిక్షకుడు సిరంజి ఫణికుమార్ వద్ద చేర్పించారు. ప్రస్తుతం ఎస్‌బీ నగర్‌లోని స్వర్ణభారతి పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. జాతీయ జట్టుకు ఎంపికైన జశ్వంత్ ఈ ఏడాది మార్చి నెలలో 22 నుంచి 26 వరకు నాగపూర్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. ఎంపికైన క్రీడాకారుడిని స్వర్ణభారతి పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ శుక్రవారం సన్మానించి అభినందించారు.


కోచ్‌తో ఫుట్‌బాల్ క్రీడాకారుడు జశ్వంత్

రామజోగి మందు కొనరే!

(5వ పేజీ తరువాయి)

రామ భక్తులైన భక్తరామదాసు, తూము నరసింహదాసు, త్యాగయ్య ఎన్నో కీర్తనలను స్వయంగా రాసి పుష్పాల రూపంలో స్వామి వారికి సమర్పించారు. శామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్ వంటి కొంతమంది వాగ్గేయకారులు అమ్మవారి భక్తులైనప్పటికీ రామున్ని కూడా కీర్తించి తరించారు. అంతే కాకుండా కర్ణాటక సంగీత ప్రపంచంలో కాని, హిందుస్థానీ సంగీత ప్రపంచంలో కాని రాముని కీర్తించని వాగ్గేయకారుడు లేదంటే అతిశయోక్తి కాదు.

53 ఏళ్ల క్రితం...

స్థానిక రంగనాయకుల గుట్టపై ఉన్న రామదాసు ధ్యాన మందిరంలో 53 ఏళ్ల క్రితం వాగ్గేయకార ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. దేవస్థానం ఆధ్వర్యంలో 1972 నుంచి నిర్వహిస్తున్నారు. అయితే ఆ మందిరం గుట్టపై ఉండటంతో ప్రేక్షకుల రాక తక్కువగా ఉందనే కారణంతో తిరిగి ఉత్సవాల నిర్వహణ ప్రాంగణాన్ని కల్యాణ మండపం వేదిక వద్దకు మార్చారు. గత పుష్కర కాలంగా భక్తరామదాసు జయంతిని పురస్కరించుకొని వాగ్గేయకార ఉత్సవాలను చిత్రకూట మండప ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. వాగ్గేయకార ఉత్సవాల్లో గతంలో మంగళంపల్లి బాల మురళీకృష్ణ, ఈమని శంకర శాస్త్రి, నూకల చిన సత్యనారాయణ, ఎల్లా వెంకటేశ్వరరావు, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి, ఎస్‌సీహెచ్ కృష్ణమాచార్యులు, మాండలిన్ శ్రీనివాస్, మహారాజపురి సంతానం, పండిట్ హరి ప్రసాద్ చౌరాసియా, శోభరాజు వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

నవరత్న కీర్తనలు

భక్తరామదాసు జయంతి ఉత్సవాల్లో నవరత్న కీర్తనల్లో రామయ్యకు నీరాజనం ఒక ప్రత్యేకతను చాటుకుంటోంది. భక్తరామదాసు గళం, కలం నుంచి జాలువారిన నవరత్న కీర్తనలను ఎంచుకొని ప్రముఖ సంగీత విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తి నవరత్న కీర్తనలతో ప్రతి ఏటా వాగ్గేయకార ఉత్సవాల ఆరంభంలో రామయ్యకు నీరాజనం సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదే సంప్రదాయాన్ని ఆయన ప్రియ శిష్యులుగా పేరొందిన మల్లాది బ్రదర్స్ ఆధ్వర్యంలో నేటికి కొనసాగిస్తున్నారు.

కొవ్వూరు రైల్వేలైన్ పట్టాలెక్కేనా!?

(5వ పేజీ తరువాయి)

రూ.1000కోట్ల ఆర్థిక సహకారంతో రైల్వేలైన్ నిర్మించారు. సత్తుపల్లి నుంచి కొత్తగూడెం వరకు రైల్వేలైన్ ద్వారా గత రెండేళ్ల నుంచి బొగ్గు రవాణా చేపడుతున్నారు. అయితే సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు డబుల్ ట్రాక్ రైల్వేలైన్ నిర్మాణం చేపడితే ప్రజల ప్రయాణానికి కూడా ఎంతో అనువుగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి నేరుగా వయా డోర్నకల్ మీదుగా కొత్తగూడెం- సత్తుపల్లి- జంగారెడ్డిగూడెం- కొవ్వూరు వరకు ప్రయాణం చేయవచ్చు. అక్కడి నుంచి విశాఖపట్నం వరకు కూడా వెళ్లేందుకు వీలుంటుంది.

ఈ రైల్వేలైన్ నిర్మాణం వల్ల పలు రైళ్లు ఆంధ్రాతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు వీలుంటుంది. ప్రయాణికులకు ఖర్చుతోపాటు ప్రయాణం దూరం తగ్గుతుంది. హైదరాబాద్ నుంచి వైజాక్‌కు 150కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. ఈ ప్రాంతాలకు పలు రైల్వేస్టేషన్లు రావడంతో అభివృద్ధి చెందుతాయి. రైతులు పండించిన పంటలు, వివిధ ఉత్పత్తులు రవాణా చేసేందుకు రైల్వేలైన్ ఉపయోగపడుతుంది. పెద్దఎత్తున నిధులు ఈసారి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తే రైల్వేలైన్ పనులు వేగవంతంగా జరిగే అవకాశాలు ఉంటాయి.

ఇక సింగరేణి సంస్థ నూతన బొగ్గు బావులకు అనుమతులు లభించి నిధులు కేటాయిస్తే సంస్థ పురోగతితో పాటు అభివృద్ధి జరుగుతుంది. సింగరేణి ప్రతిపాదించిన నూతన బొగ్గు బావుల అనుమతుల ఫైల్ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చి నూతన బొగ్గు బావులకు అనుమతులు ఇస్తే యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుంది.

ఇక కొత్తగూడెంలోని రామవరం, గరీబ్‌పేట, సుజాతనగర్ ప్రాంతాల్లో ఏర్పాటుచేసే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు కేంద్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నిధుల కేటాయింపు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎయిర్‌పోర్టు రవాణా మార్గం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి సులువుగా ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రవాణా మార్గాలు మరింత సులువుగా ఉండేందుకు జాతీయ రహదారుల నిర్మాణాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి రవాణా సౌకర్యాలను మెరుగు పర్చుకునేందుకు రవాణా నిర్మాణాలు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

అదేవిధంగా భద్రాద్రి జిల్లాలో వ్యవసాయ రంగంలో పామాయిల్ సాగు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం మరింతగా ప్రోత్సాహించి రైతులకు సబ్సిడీలతో నిధులు కేటాయిస్తే పామాయిల్ పంటలను ఉమ్మడి జిల్లాతోపాటు తెలంగాణ రాష్ట్రంలోనే పలు జిల్లాలో రైతులు అత్యధికంగా సాగు విస్తరణ చేపడుతారు.

ముస్తాబైన ధ్యాన మందిరం

(5వ పేజీ తరువాయి)

జరుగుతుంది. 10.30 గంటలకు భక్త రామదాసు కీర్తనల గోష్ఠి గానం జరుగుతుంది. ఆది, సోమవారాల్లో ధ్యాన మందిరంలోని ఆడిటోరియంలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆడిటోరియం నిర్మాణం జరిగాక తొలిసారి భక్తరామదాసు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. భక్త రామదాసుగా మారిన కంచర్ల గోపన్న స్వస్థలమే నేలకొండపల్లి.

రామదాసుకు పట్టు వస్త్రాల సమర్పణ

కంచర్ల వంశంలో 10వ తరానికి చెందిన కంచర్ల శ్రీనివాసరావు శుక్రవారం నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యానమందిరంలో రామదాసుకు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్త రామదాసు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రామదాసుకు పట్టు వస్త్రాలు సమర్పించటం గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తున్నది. దాని ప్రకారం శ్రీనివాసరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత అర్చకుడు సౌమిత్రి రమేష్ ప్రత్యేక పూజలు చేశా రు. కార్యక్రమంలో విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు సాధు రాధాకృష్ణమూర్తి సభ్యులు మన్నె కోటేశ్వరరావు, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, ఓరుగంటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు భద్రాద్రి జిల్లాలో టీపీసీసీ లీగల్‌సెల్ ఛైర్మన్ పర్యటన

కొత్తగూడెం లీగల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ శనివారం జిల్లాలో పర్యటిస్తారని లీగల్‌సెల్ వైస్‌ఛైర్మన్ బి. సంజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మొదట భద్రాచలం వెళ్లి అక్కడ న్యాయవాదులతో బేటి అయిన తర్వాత, కొత్తగూడెం చేరుకుంటారని, కొత్తగూడెంలో న్యాయవాదులతో ఇష్టాగోష్టి నిర్వహిస్తారన్నారు. అనంతరం ఖమ్మం పర్యటనను వెళ్లనున్నారు.

మిషన్‌భగీరథ కార్యాలయంలో పాము కలకలం

అశ్వారావుపేట, జనవరి31(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలోని మిషన్‌భగీరథ కార్యాలయంలో ఓ పాము కనిపించి కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం సిబ్బంది కార్యాలయం లోపలకు రాగానే ఓ ఐదు అడుగుల పొడుగు కల పాము కనిపించింది. సిబ్బంది దగ్గరకు వచ్చేసరికి పాము ఆ సామాగ్రిలోకి చొరబడింది. తీవ్ర భయాందోళనకు గురైన సిబ్బంది జీలుగుమిల్లి మండలం, ప్రదీప్ అనే స్నేక్ క్యాచర్‌ను పిలిపించారు. అతడు దానిని పట్టుకొని అటవీప్రాంతంలో వదిలాడు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

మణుగూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావును కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఎస్‌డబ్ల్యూవో హనుమంతరావు సస్పెండ్ చేశారు. ఈయన స్థానంలో ఎస్టీ బాలుర హాస్టల్ వార్డెన్‌కు ఈ హాస్టల్ బాధ్యతలను అప్పగించారు. సస్పెండ్ అయిన వార్డెన్ కొంత కాలంగా విధుల పట్ల అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తూ పిల్లలను పట్టించుకోక పోవడంతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయినా కూడా శ్రీనివాస్ ప్రవర్తలో మార్పు లేనందున అతన్ని సస్పెండ్ చేసినట్టు అధికారులు తెలిపారు.

వరాలు కురిసేనా!?

(5వ పేజీ తరువాయి)

సమావేశాల్లో గోదావరి జలకాలుష్య ప్రాజెక్టు తెర పైకి వస్తుందన్న ఆశ, నిధులు కేటాయింపు ఉంటుందని నదీ పరివాహక ప్రజలు భావిస్తున్నారు.

జాతీయ రహదారులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి సారపాక - ఏటూరునాగారం, భద్రాచలం-భూపాలపట్నంతోపాటు కొత్తగూడెం-జగ్గయ్యపేట, పలు జాతీయ రహదారులు అభివృద్ధికి ప్రతిపాదనలున్నాయి. వీటికి నిధులు కేటాయిస్తే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కొత్తగూడెం కేంద్రంగా ఎయిర్‌పోర్టు ఏర్పాటుచేయాలని ఇటీవల కేంద్ర ఎయిర్‌పోర్టు అథారిటీ బృందం కూడా భూములు పరిశీలించింది. సుమారు 900 ఎకరాల భూములు ఇందుకు ప్రతిపాదన చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఎయిర్‌పోర్టుకు నిధులు కేటాయిస్తే కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు కూడా నిధులు కేటాయించే అవకాశం ఉంది.

రైలు రవాణా

ఉమ్మడి జిల్లాలో కీలకంగా రైలు రవాణ అభివృద్ధి చేయాల్సి ఉంది భద్రాచలం-మల్కాన్‌గిరి రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం లభించింది. దీనికి నిధులు పెద్దఎత్తున కేటాయిస్తే ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీ, తెలంగాణ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రైలు రవాణ మార్గం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలను ఈ రైలు మార్గం తక్కువ దూరంతో అనుసంధానం చేయనుంది.

అలాగే భద్రాచల-పాండురంగాపురం, కొవ్వూరు-కొత్తగూడెం రైల్వే లైన్లకు ప్రతిపానదలు మంజూరైనా నిధులు మంజూరు కావడంలేదు. పాండురంగాపురం సారపాక 20కి.మీ. రైల్వే నిర్మాణం అవసరం ఉంది. మణుగూరు-రామగుండం, సత్తుపల్లి- కొండపల్లి రైల్వేలైన్లకు కూడా ప్రతిపాదనలున్నాయి. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన సమస్యలకు కేంద్రం నిధులు ఇస్తుందని ఆశిస్తున్నానని, మళ్లీ సమస్యలు ప్రస్తావిస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

చిట్టిహనుమత్‌శాస్త్రి సేవలు శ్లాఘనీయం

భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నాలుగు దశాబ్దాల పాటు కృష్ణ యజుర్వేద పండితులుగా బాధ్యతలు నిర్వహించిన చిట్టిహనుమత్‌శాస్త్రి సేవలు శ్లాఘనీయమని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన హనుమత్‌శాస్త్రికి దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం తరఫున ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వ్యవస్థలో అధికారులు, ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు, బదిలీలు, ఉద్యోగ విరమణలు సాధారణమన్నారు. వేద పండితులుగా నాలుగు దశాబ్దాలు రామయ్య సన్నిధిలో పనిచేసే భాగ్యం హనుమత్‌శాస్త్రికి దక్కడం ఆయన పూర్వ జన్మ సుకృతమన్నారు. ఈసమయం లో హనుమత్‌శాస్త్రి దంపతులకు దేవస్థానం తరఫున వేద ఆ శీర్వచనంతో పాటు శాలువ, జ్ఞాపికను ఈవో రమాదేవి అందజేశారు. అ లాగే దేవస్థానంలోని వైదిక పరిపాలన సిబ్బంది ఆయనను సత్కరించారు.


వేద పడితులను సత్కరిస్తున్న ఈవో

సింగరేణిలో డైరెక్టర్ల పోస్టు కోసం జోరుగా పైరవీలు?

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్, డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ పోస్టుల కోసం జోరుగా పైరవీలు సాగుతున్నాయనే ప్రచారం సాగుతోంది. డైరెక్టర్ల పోస్టులను సొంతం చేసుకునేందుకు పలువురు జనరల్ మేనేజర్లు హైదరాబాద్‌లో పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. డైరెక్టర్ ఆపరేషన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్‌వీకే. శ్రీనివాస్ పదవి కాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. డైరెక్టర్ అండ్ ప్రాజెక్టు ప్లానింగ్ సైతం అదే రోజు పదవీ కాలం ముగుస్తుండటంతో రెండు డైరెక్టర్ పోస్టులకు శుక్రవారం హైదరాబాద్‌లోని చీఫ్‌సెక్రటరీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇంటర్వ్యూలకు మణుగూరు జీఎం దుర్గం రాంచందర్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వి. సూర్యనారాయణ, మందమర్రి జీఎం దేవేందర్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ కార్పోరేట్ జీఎం సాయిబాబా, ఆడ్రియాల ప్రాజెక్టు జీఎం వెంకటేశ్వర్లు ఇంటర్వ్యూలకు హజరైనట్లు తెలుస్తోంది. డైరెక్టర్ పోస్టులను సొంతం చేసుకునేందుకు పలువురు పోటీలో ఉన్న అధికారులు తన రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తూ మంత్రుల ద్వార జోరుగా పైరవీలు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల అమలులో రావడం వల్ల ఫలితాలు వెల్లడిస్తారా.. ఉన్న డైరెక్టర్లను కొనసాగిస్తారా.. ఇతర జీఎంలకు అదనపు బాధ్యతలు అప్పచెప్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కేటీపీఎస్ 7వ దశ సీఈగా శ్రీనివాసబాబు



పాల్వంచ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ కేటీపీఎస్ 7వ దశ సీఈగా శ్రీనివాసబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు 7దశ సీఈగా విధులు నిర్వహించిన పాలకుర్తి వెంకటేశ్వరరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేయడంతో జెన్కో ఉన్నతాధికారులు ఆయన స్థానంలో శ్రీనివాసాబాబుకు ఆ బాధ్యతలను అప్పగించారు. పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సీఈగా కొనసాగుతున్న నేపథ్యంలో శ్రీనివాసబాబుకు అధనపు బాధ్యతలుగా కేటీపీఎస్ 7వ దశ బాధ్యతలను కూడా అప్పగించారు.

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

- కొత్త ఓటర్ల జాబితా తయారీకి సన్నాహాలు
- ఫిబ్రవరి 3న ముసాయిదా జాబితా
- రాజకీయ నాయకుల సమావేశాలు
- సిద్ధంగా ఉండాలంటూ జిల్లా అధికారులకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు అధికారయంత్రాంగం సిద్ధంగా ఉండాలంటూ పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర రాజధాని నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. జిల్లాలో పంచాయతీలు, ఓటర్ల జాబితా, ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలు బ్యాలెట్ బాక్సుల వివరాలు, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ తదితర అంశాలపై సమీక్షించి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు. తేది ఎప్పుడు ప్రకటించినా ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఫిబ్రవరి చివరిలో, మార్చి మొదటి వారంలో ఎన్నికలను నిర్వహించేందుకు యోచిస్తుంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 5న మంత్రి వర్గ ఉపసంఘం సమావేశం తర్వాత ఒక కొలిక్కి వచ్చే ఆస్కారం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ లోగా ఎన్నికలకు కావాల్సిన కసరత్తు మొత్తాన్ని పూర్తి చేయాలని ఆదేశించినట్లు వివరించారు.

- జిల్లాలో ప్రస్తుతం 589 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి నుంచి కొత్తగా ఏదులాపురం, పెద్దతండా, గుర్రాలపాడు, వెంకటగిరి,గుదిమళ్ల, గొల్లగూడెం, బారుగూడెం, ముత్తగూడెం, పోలేపల్లి, రాజీవ్‌గృహకల్ప, పల్లెగూడెం పరిధిలోని రెడ్డిపల్లెతో కలిపి ఏదులాపురం మునిసిపాలిటీగా ఏర్పాటు అయ్యింది. వీటిని పంచాయతీలుగా తొలగించేందుకు ప్రత్యేకంగా జీవో రావాల్సి ఉంది. అంతేకాదు జిల్లాలో కొత్తగా మరో 15 పంచాయతీల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటిని ఆమోదిస్తూ కూడా ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. వీటికి ఉత్తర్వులు వస్తే పూర్తి స్థాయిలో జిల్లాలో పంచాయతీలకు ప్రత్యేక రూపు రానుంది. వాటి ఆధారంగా కొత్త వాటితో పాటు విడిపోయిన పంచాయతీల్లో కూడా వార్డుల విభజన, రిజర్వేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పన...

ప్రస్తుతం ఉన్న 589 గ్రామపంచాయతీలతో ఓటర్ల జాబితాను ప్రకటించారు. విడుదల చేసిన జాబితా ప్రకారం జిల్లాలో 8,64,702 మంది ఓటర్లు ఉన్నారు. అయితే మునిసిపాలిటీలో కలిసిన పంచాయతీల ఓటర్లను విడదీసి ప్రత్యేకంగా జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఫిబ్రవరి 3న ఇటీవలె కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితా నుంచి ఓటర్ల జాబితాను తయారు చేసి ముసాయిదా జాబితాను ప్రకటించనున్నారు. వీటని ఫిబ్రవరి 4న అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి ఎంపీడీవోలు ఓటర్ల చేర్పులు మార్పులపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 6న సప్లిమెంటరీ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలంటూ శుక్రవారం షెడ్యూల్ ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ ప్రక్రియను అధికార యంత్రాంగం సిద్ధం చేస్తున్నారు.

వీటితో పాటు ఇప్పటికే జిల్లాకు చేరిన ఎన్నికల నిర్వహణ సామగ్రిని చేర్చి భద్రపరిచారు. బ్యాలెట్ బాక్సులను సిద్ధంచేశారు. 9లక్షల 51,500 బ్యాలెట్ పత్రాల ముద్రించి భద్రపరిచారు. జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి ప్రణాళికలను కూడా సిద్ధం చేశారు. సర్కారు పంచాయతీ పోరుపై ప్రకటన వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లోనూ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

మిరప కూలీల ట్రాక్టర్ బోల్తా

- ఒకరి మృతి, 23 మందికి గాయాలు
- బోనకల్ గ్రామంలో విషాదం


వరమ్మ(ఫైల్)

బోనకల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాక్టర్ పల్టీ కొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, 23 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బోనకల్ గ్రామ శివారు ప్రాంతంలో శుక్రవారం జరిగింది. ఆంధ్ర రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి గ్రామంలో మిరప కోతలకు వెళ్లేందుకు గానూ బోనకల్ గ్రామంలో 25 మంది కూలీలు ట్రాక్టర్‌లో ఎక్కారు. పొలానికి బయలుదేరి వెళ్లే క్రమంలో బోనకల్ శివారు ప్రాంతంలోని బీబీసీ కెనాల్ వద్ద గల ప్రధాన రహదారి పై ఎదురుగా ఉన్న వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా మరో వాహనం రావడంతో సడెన్ బ్రేకులు వేయగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రక్కు కింద పడ్డ యార్లగడ్డ వరమ్మ(60) అక్కడికక్కడే మృతి చెందింది.

ఆత్మకూరి లక్ష్మీదేవి, లింగం నాగమణి, మరీదు ధనలక్ష్మి, నిమ్మగడ్డ సుబ్బమ్మ, మరీదు పద్మ, గాలి కృష్ణవేణి, మోర్ల మహాలక్ష్మి, మరీదు శైలజ, మోర్ల నారాయణమ్మ, లింగం సుశీలమ్మ, వసల త్రివేణి, పెదగౌండ్ల వెంకటరమణ, మరీదు సత్యం, జామిలికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డవారిని 108 వాహనంతో పాటు ఆటోలలో బోనకల్ పీహెచ్సీ, ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ మధుబాబు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరు పై దర్యాప్తు నిర్వహించారు. మృతిరాలికి భర్త, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో వేగంగా ట్రాక్టర్ నడపడం వలనే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనతో రోడ్డు పై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: డిప్యూటీ సీఎం

ట్రాక్టర్ పల్టీ ఘటనలో గాయపడ్డ కూలీలకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షు డు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాలి దుర్గారావు, మరీదు శ్రీనివాసరావుల మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, గాయపడ్డ వారికి కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సీడ్స్, జడ్పీ చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్ రాజ్‌లు డిమాండ్ చేశారు. వారు ఖమ్మం ప్రభుత్వాసుపత్రి కి వెళ్లి గాయపడిన వారిని ప రామర్శించారు. అదే విధంగా సీపీఎం రాష్ట్ర నాయకులు పొ న్నం వెంకటేశ్వరరావు, మడిపల్లి గోపాలరావు, కిలారు సురేష్, తెల్లాకుల శ్రీనివాసరావులు మృతురాలి కుటుంబానికి సంతాపం తెలిపారు. ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రుల రోదనలతో బోనకల్ గ్రా మంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీ


వరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, రాయల

ఉపాధి ఉద్యోగులకు అందని వేతనాలు


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవటంతో రెండు రోజులుగా డీఆర్‌డీఏ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం ఖమ్మం డీఆర్‌డీఏలో పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఉద్యోగులు కలిసి తమ సమస్యలను వివరించారు. మూడు నెలలుగా వేతనాలు లేక పోవటంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీడీ వెంకటరాజు, హెచ్ఆర్ మేనేజరు విజేత, సురేశ్, స్రవంతి, శిల్ప, జ్యోతి, కొండలు, వరలక్ష్మీ, ముజీబ్, సతీష్, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు పెన్షన్ ఇవ్వాలి

- టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్రావు

బోనకల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలలో బాగంగా ఫించన్ వెంటనే ఇచ్చే విదంగా ఉత్తర్వులు ఇవ్వాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 2న ఖమ్మంలో జరగనున్న టీజేఎస్ మూడో ప్లీనరీకి ప్రొఫెసర్ కొదండరాం హాజరవుతున్నందున విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు కేసుల పాలై జైలు జీవితం గడిపారని గుర్తించారు. కోట్లాడి సాదించుకున్న రాష్ట్రంలో ఉద్యమకారులకు సరైన గుర్తింపు ఇచ్చేలా చూడాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పున్నం చందర్‌కు అందజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న గోపగాని శంకర్రావు

ఈ కార్యక్రమంలో టీజేఎస్, జేఏసీ నాయకులు వి. బాబు, ఎస్‌కె. సర్దార్, నాగేందర్‌రావు, జిడుగు వెంకటేశ్వర్లు, నర్సింహారావు, సత్యనారాయణ, బీరెల్లి కృష్ణ, వాసు, గూడా పాండు రంగయ్యశాస్త్రీ, శ్రీనివాసరావు, పుల్లఖండం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఆశిస్తున్న ఆకుముడత

వైరా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఈ యాసంగిలో వరిని జిల్లాలో ఇప్పటివరకు సుమారు 1.16లక్షల ఎకరాల్లో సాగుచేయడం జరుగుతుంది. ప్రస్తుతం జిల్లాలో వరి పిలకవేసే దశలో ఉంది. ఈ దశలో ఉన్న వరిలో ఆకుముడత ఆశిస్తున్నట్లు గమనించటం జరిగిందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు.

ఆకుముడత నష్టపరిచే విధానం...

ఈ పురుగు ఆశించినప్పుడు ఆకులు నిలువుగా ముడుచుకొని లోపల ఉంటూ పత్ర హరితాన్ని గోకి తింటూ ఉంటుంది. తద్వారా ఆకుల మీద తెల్లని గీతలను గమనించవచ్చు. ఆకుముడతలను విడదీస్తే లేత పసుపు లేదా ఆకుపచ్చ లార్వాలను గమనించవచ్చు. అదే విధంగా పొలంలో గుంపులు గుంపులుగా ఎగిరే రెక్కల పురుగులను కూడా గమనించవచ్చు. దుబ్బుకు రెండు నుంచి మూడు కొత్తగా తెల్లగా గీకబడిన ఆకులు వాటిలో చిన్న లార్వాలు గమనిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

సస్యరక్షణ చర్యలు...

తొలి దశలో ఎస్సెట్ 75ఎస్పీ 1.5గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్పీ 2గ్రాములు లేదా క్లోరాంట్రానిలిపోల్ 18.5ఎస్‌సీ 0.3మిల్లీలీటర్లు లేదా ఫ్లూబెండామైడ్ 20డబ్ల్యూజీ 0.25గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 480ఎస్‌సీ 0.1మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.


వరి పంటలో ఆశించిన ఆకుముడత తెగులు

సత్తుపల్లిలో దుప్పి కళేబరం లభ్యం

సత్తుపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని వేంసూరు రోడ్డులో మెట్టాంజనేయ స్వామి గుడి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో దుప్పి కళేబరాన్ని కొందరు కనుగొన్నారు. దీనిని ఫొటోతీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశారు. దుప్పి చనిపోయి నెలరోజులకు పైగా గడిచి ఉంటుందని, సంఘటనా స్థలంలో కళేబరాన్ని బట్టి స్పష్టమవుతుంది. వేంసూరు రోడ్డును ఆనుకుని ఉన్న అర్బన్ పార్క్ నుంచి దుప్పి తప్పించుకుని రాగా కుక్కలు దాడిచేసి చంపి ఉంటాయని కొందరు భావిస్తూ ఉండగా, దీనిని అటవీ శాఖ సిబ్బంది ఖండిస్తున్నారు. దీనిపై రేంజర్ స్నేహలత స్పందిస్తూ చనిపోయిన దుప్పి అర్బన్‌పార్క్ నుంచి బయటకు వెళ్లింది కాదని, బయట నుంచి వచ్చి ఉండవచ్చని, అయినా దుప్పి మృతిచెందిన విషయం తమ దృష్టికి రాలేదని అన్నారు.

బాధితురాలి వాంగ్మూలం కోసం.. బయటకు వచ్చిన న్యాయాధికారి


వాంగ్మూలం నమోదు చేస్తున్న న్యాయాధికారి

భద్రాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఓ చెక్ బౌన్సు కేసులో వాంగ్మూలం ఇచ్చేందుకు వచ్చిన అనారోగ్యంతో ఉన్న బాధితురాలి వాంగ్మూలం సేకరించేందుకు కోర్టు హాలు నుంచి న్యాయాధికారి బయటకు వచ్చిన సంఘటన ఇది. భద్రాచలంలోని ప్రథమశ్రేణి న్యాయస్థానంలో శుక్రవారం భద్రాచలానికి చెందిన ఉరిమెళ్ల పద్మావతి అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. మొదటి అంతస్తులో ఉన్న కోర్టు హాలుకు మెట్లు ఎక్కి రాలేనని చెప్పారు. దీంతో సానుకూలంగా స్పందించిన న్యాయాధికారి శివనాయక్ కోర్టు హాలు నుంచి కింద గ్రౌండ్ ఫ్లోరు వద్దకు వచ్చి ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

శుభ ముహూర్తాలకు వేళాయె..

- రాబోయే మూడు నెలలు 10వేలకు పైగా శుభకార్యాలు
- శుభముహూర్తాలతో పలు కుటుంబాలకు ఉపాధి

కొత్తగూడెం అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముత్యాల తలంబ్రాలు, పచ్చని పందిళ్లు, మహిళల సందడి, పెద్దల దీవెనలతో ఒకటవుతున్న జంటలు, నూతన వ్యాపారాలు ప్రారంభించేవారితో పాటు నూతన దేవాలయాలు ప్రారంభోత్సవాలు చేసేవారు, శుభముహూర్తాలు ఈ రూపేనా ఈ దృశ్యాలు కోసం మాఘమాసం ఎప్పుడు వస్తుందా..ఎదురుచూస్తుంటారు. పుష్యమాసంలో శుభముహూర్తాలు ఉండవని మాఘమాసం జనవరి 30నుంచి రావడంతో అన్ని ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో వివాహాలు, గృహప్రవేశాలు, ఉపనయనాలు, ఆడబిడ్డలకు బడిబియ్యం పోయడం, పట్టుపంచలు ధరింపచేయడం, నిశ్చితార్థంతో పాటు కొత్త నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయడం తదితర శుభకార్యాలకు ముహూర్తాలు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయి. పెళ్ళిళ్లకు జనవరి 31నుంచి శుభముహూర్తాలు ఉన్నాయి. రాబోయే మూడు నెలలు 50కి పైగా ముహూర్తాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. గత ఏడాది డిసెంబరు 27వరకు మంచి ము హూర్తాలు లేక వివాహాది శుభకార్యాలకు బ్రేకులు పడ్డాయి. 25రోజుల తరువాత ఈనెల 31న గృహప్రవేశాలకు మంచి సమయం వచ్చింది. ఫిబ్రవరి 02 నుంచి పెళ్లిళ్లకు కలిసి వస్తుందని పురోహితులు చెబుతున్నారు.

సీజనల్ డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాలు చేసుకునే వృత్తిదారులకు అనువైన సమయం. కళ్యాణ మండపాల నిర్వాహకులు, పురోహితులు, బంగారం, పూజ అలంకరణ సామాగ్రి వ్యాపారులు, వంట మనుషులు, ప్రిటింగ్ ప్రెస్, లైటింగ్, డెకరేషన్, టెంట్ హౌస్‌లు, ఫొటో గ్రాఫర్లకు డిమాండ్‌లు పెరిగాయి.

మాఘమాసంలో జనవరి 31 నాటి ఉదయం, రాత్రి రెండు ముహూర్తాలు, ఫిబ్రవరిలో 16, మార్చిలో 14 ముహూర్తాలతో పాటు తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినం, ఏప్రిల్‌లో 20ముహూర్తాలు, మే నెలలో 21, జూన్‌లో 2నుంచి 8వరకు, 10వ తేదీన గురుమౌఢ్యమి ప్రారంభంతో శుభముహూర్తాలు లేవు. జులైలో 6, ఆగస్టులో 14, సెప్టెంబరులో 7, అక్టోబరులో 18, నవంబరులో 16ముహూర్తాలుండగా.. 30వ తేదీన శుక్ర మౌఢ్యమి ప్రారంభంతో శుభముహూర్తాలు లేవని పురోహితులు చెబుతున్నారు.

2025 శుభ ముహూర్తముల పట్టిక

జనవరి	: 31
ఫిబ్రవరి	: 2,3,6,7,8,9,10,13,15,16,17,20,21, 22, 23,24
మార్చి	: 1, 2, 3, 6, 7,8,9,10,12,14,15,16,17,31
ఏప్రిల్	: 3,4,5,6,7,9, 10,11,12,13, 16,18,19,20,21,22, 23,24,29,30
మే	: 1,2,3,4,5,7,8,10,11,13,14,15,17,18,19,21, 22,28,29,30,31
జూన్	: 2,4,5,6,7,8 (10వ తేది నుండి గురుమౌఢ్యమి ప్రారంభం. శుభముహూర్తములు లేవు)
జూలై	: 26,27,28,29,30,31
ఆగస్టు	: 1,3,4,6,7,8,9,10,11,12,13,14,17,18
సెప్టెంబర్	: 22,24,25,26,27,28,29
అక్టోబర్	: 1,2,3,4, 6,8,10,11,12,13,15, 16,17,24,26,29, 30,31
నవంబర్	: 1,2,3,7,8,10,13,14,15,22,23,24,25,26,27,28 (30 వ తేది నుండి శుక్ర మౌఢ్యమి ప్రారంభం. శుభ ముహూర్తములు లేవు)
డిసెంబర్	: ఈ మాసం అంతా ముహూర్తములు లేవు. శుక్ర మౌఢ్యమి

ఉత్తరాయణ పుణ్యకాలం ఎంతో పవిత్రమైంది

గొడవర్తి సంపత్‌కుమార్ అప్పలాచార్య పంచాంగ కర్త

మకరసంక్రాంతి పర్వదినం నాటినుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. ఈకాలం శుభకార్యాలకు ఎంతో విశిష్టమైనది. ఉత్తరాయణం నాటినుంచి ఆరు మాసాల్లో ఐదు మాసాలైన మాఘమాసం, ఫాల్గుణం, చైత్రం, వైశాఖం, జేష్టమాసం వరకు వివాహాలకు మంచి ముహూర్తాలు ఉంటాయి. ఉత్తరాయణం దేవతలకు పగటికాలంగా పరిగణిస్తారు. ఈయేడాది జూన్ 8వరకు ముహూర్తాలు ఉండటంతో నూతన కార్యాలకు శుభశకునం.

సింగరేణి కార్మికుల వేతనాలు పెంచాలి

- టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం



మాట్లాడుతున్న సూర్యం

ఇల్లెందు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు ప్రభుత్వాలు మారిన పెరగడం లేదని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. సూర్యం, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవేద న వ్యక్తం చేశారు. శుక్రవారం ఇల్లెందులో ఎల్లన్నభవనంలో ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలు గడుస్తున్న సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచకుండ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ మహాసభలోకాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్ షావళి, ప్రధాన కార్యదర్శి తోకల రమేష్, ఉపాధ్యక్షు లు ఆర్. మధుసూధన్‌రెడ్డి, సతీష్, పుల్లయ్య, మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య, గురునాథం, బాలు, పద్మ, సుమిత్ర తదితరులున్నారు.

పోలీసుశాఖలో పనిచేసేవారు క్రమశిక్షణతో ఉండాలి

- జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా సాయుధ బలగాల డీమొబిలైజేషన్ పరేడ్
- భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్


గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో పని చేసే ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఉండాలని, బాధ్యతగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. శుక్రవారం హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో 15రోజులపాటు సాగిన జిల్లా ఆర్మడ్ సిబ్బంది మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఆర్మడ్‌సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవం వందనాన్ని స్వీకరించారు. 05 ప్లటూన్లతో ఏర్పాటు చేసిన ఈ పరేడ్‌కు అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు ప్లటూన్ కమాండర్‌గా వ్యవహరించారు. 15రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఇండోర్, ఔటర్‌రోడ్, ఫైరింగ్ ప్రాక్టీక్‌ల్లో సిబ్బంది అంతా ఉత్సాహంగా పాల్గొన్నారని ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ ఎస్పీకి తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ మొబిలైజేషన్ కార్యక్రమం ద్వార శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కూడ లభిస్తుందన్నారు. అనంతరం అక్కడ పాల్గొన్న అధికారులు, సిబ్బంది సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. డీమోబిలైజేషన్ పరేడ్ కార్యక్రమాన్ని సుందరంగా ఏర్పాటు చేసిన అధికారులను అభినందించారు. పోలీసుశాఖలో పని చేస్తూ విశిష్ట సేవలు అందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాకు చెందిన 250మందికి ఎస్పీ మెడల్స్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సీఐలు నాగరాజు, శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాలు, తదితరులు పాల్గొన్నారు.

హెవీవాటర్ ప్లాంట్ జీఎంగా హెచ్‌కె శర్మ



అశ్వాపురం జనవరి 31(ఆంధ్రజ్యోతి): మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ జీఎంగా హరీష్‌కుమార్ శర్మ నియమితులయ్యారు.ఈమేరకు శుక్రవారం రాత్రి భారజల బోర్డు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు జీఎంగా వ్యవహరిస్తున్న జగ్గారావు శుక్రవారం పదవీవిరమణ చేశారు.దీంతో ప్రస్తుతం డీజీఎంగా వ్యవహరిస్తున్న హరీష్‌కుమార్ శర్మను జీఎం గా నియమించారు. ఈమేరకు ఆయన శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.



ప్రభుత్వ భూముల ఆక్రమణలు తేల్చాలి: విక్రమ్

ఖమ్మం, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న ఎన్నెస్పీ స్థలాల్లో జరుగుతున్న ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. కార్పోరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఎన్నెస్పీ ప్రాంతంలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ప్రభుత్వ భూమి పరుల పాలు' శీర్షికన కథనం ప్రచురించింది. కాగా దానిపై స్పందించిన ఆయన ఆయా ఆక్రమణలపై కలెక్టర్, కమిషనర్, ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	30
కాకరకాయ	34
బెండకాయ	48
పొట్లకాయ	40
దోసకాయ	28-44
చిక్కుడు	48
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	20
దొండ	28-34
సొరకాయ	18
క్యారెట్	28
క్యాప్సికం	54
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	155
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	గేంచేంజర్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పుష్ప 2
కేపీఎస్:	ప్రేమిస్తా
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

కలగానే కనకదుర్గ కాలనీ రోడ్డు

బస్ డిపో నుంచి బైపాస్ వరకు రోడ్డు వెడల్పే ప్రధాన సమస్య

నాయిబ్రాహ్మణ కాలనీలో నీటి కటకట

సమస్యల వలయంలో 51వ డివిజన్

ఖమ్మం మార్కెట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోనే శరవేగంగా నూతన భవంతులు, నివాస గృహాల కట్టడాలతో కొత్తదనంతో దూసుకు పోతున్న ప్రాంతం 51వ డివిజన్. కార్పొరేషన్‌లోనే అతి పెద్ద డివిజన్‌లలో ఒకటైన ఈ డివిజన్‌లో పలు సమస్యలు తిష్ట వేశాయని స్థానికులు పేర్కొంటున్నారు. మోర్ మార్కెట్ నుంచి బైపాస్‌రోడ్డు వరకు ఆనుకుని ఉన్న ఈ డివిజన్ కమర్షియల్‌గా అభివృద్ధి పథంలో ఉన్నా రోడ్లు, డ్రైనేజీల విషయంలో వెనుకబడి ఉంది ఈ డివిజన్ ప్రాంతం. సుమారు 9 వేల జనాభా, 5900 ఓట్లు కలిగిన ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం అందించట్లేదని విమ

డివిజన్ విజిట్

ర్శలు వినిపిస్తున్నాయి. అస్తవ్యస్తంగా ఇరుకు రోడ్లు, పూడిక తీయని డ్రైనేజీలు, బస్ డిపో నుంచి బైపాస్ వరకు నిత్యం వాహనాల ట్రాఫిక్‌జామ్ ఆ ప్రాంతాన్ని మరింత వెనుకబాటుకు గురి చేస్తున్నాయంటూ స్థానికులు పేర్కొంటున్నారు. డివిజన్‌లోని ముఖ్యంగా కనకదుర్గ కాలనీతో పాటు నాయిబ్రాహ్మణ కాలనీ గుట్ట ప్రాంతంలో అంతర్గత రోడ్ల నిర్మాణం, నీటి వసతికి జీఐ పైప్‌లైన్ ఆవశ్యకత ఉందని అక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. అంతే కాకుండా మరికొన్ని ప్రాంతాలలో విద్యుత్ లైన్లు క్రిందికి వేలాడుతుండటంతో పాటు, నడి రోడ్డుపై కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు నిత్యం ఇక్కట్లు పడుతున్నారు.

సువిశాల ప్రాంతం

నగరంలో గర్ల్స్ సెంటర్ నుంచి ప్రధాన కూరగాయల మార్కెట్ వరకు, బుర్హన్‌పురం, నాయిబ్రాహ్మణ కాలనీ, దొనబండ కాలనీ, మరో వైపు కనకదుర్గ, వడ్డెర



బస్‌డిపో– రాపర్తినగర్ ఇరుకు రోడ్డు

కాలనీ నుంచి ఎన్నెస్పీ క్వార్టర్స్ వరకు, ఆర్ఆర్ స్కూల్ నేతాజీనగర్, రవీంద్రనాథ్‌టాగూర్ బజార్ వరకు సుమారు 6.4 కిలోమీటర్ల మేర వరకు ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధి విషయంలో ఎక్కువ ప్రాంతం ముందజలో ఉన్నా కనగదుర్గ, నాయిబ్రాహ్మణ కాలనీలు వెనుకంజలో ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కనగదుర్గ కాలనీకి రోడ్డు కలేనా?

నగరంలోని నూతన బస్టాండ్‌కు అతి చేరువలో ఉన్న ఈ డివిజన్‌కు చెందిన ప్రధాన కాలనీ కనకదుర్గ వడ్డెర కాలనీ. ఈ కాలనీకి నూతన బస్టాండ్ దగ్గర ఉన్నా అభివృద్ధి విషయంలో వెనుకంజలో ఉందని స్థానికులు చెపుతున్నారు. కాలనీలో ఉంటే గుట్ట ప్రాంతానికి సీసీ రోడ్డు కోసం గత 20 సంవత్సరాలుగా అధికారులకు పిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆప్రాంతంలో నివసించే ప్రజలు నిత్యం పూర్తిగా రాయితో ఉన్న ఎగుడుదిగుడు ఆ రోడ్డుపై నడక ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. కనీసం ఆటో, ద్విచక్రవాహణం కూడా వెళ్ళలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం ఆవశ్యం

నగరంలో భారీ వర్షాలకు వరద వచ్చినపుడు ఎక్కువగా ఇబ్బందిపడే ఇక్కడి ప్రాంత వాసులకు ముఖ్యంగా డ్రైనేజీ, అంతర్గత రోడ్లు అత్యంత ఆవశ్యకంగా ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఖమ్మం కార్పొరేషన్‌గా అవతరించిన దగ్గర్నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రాష్ట్రంలో కొత్త ప్రంభుత్వం ఏర్పడిన అనంతరం డివిజన్ అభివృద్ధి పనులకు మున్సిపల్, సుడా ఫండ్‌ల నుంచి టెండర్లు పూర్తైన తరువాత అయా టెండర్లను రద్దు చేయడంతో డివిజన్ కొంత అభివృద్ధిలో వెనుకబడిందని స్థానికులు చెపుతున్నారు. ప్రభుత్వం ఈ ప్రాంతానికి నిధులు విడుదలచేసి అభివృద్ధి సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.



ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలి

శీలంశెట్టి రమా వీరభద్రం, 51వ డివిజన్ కార్పొరేటర్



ముఖ్యంగా ఈ డివిజన్‌లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో సతమతమవుతున్న ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి. ఈప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎక్కువ విస్తీర్ణం, నూతన నివాస గృహాల కట్టడాలు ఉన్న డివిజన్‌కు ఎక్కువ నిధులు కేటాయించాలి. కనకదుర్గ వడ్డెర కాలనీకి వెళ్లే గుట్టకు వెళ్లే నడకదారి స్థానంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు ఇవ్వాలి. ఇందుకు ప్రభుత్వం సహకరించాలి. డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నాము. ప్రభుత్వ సహకారం ఎంతో అవసరం.

కనకదుర్గ కాలనీకి రోడ్డు నిర్మించాలి

రాము, స్థానికుడు, కనకదుర్గ కాలనీ



నగరానికి నడిబొడ్డులో ఉండి కొత బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌కు అతి చేరువలో ఉన్నా మా ప్రాంతంలో రోడ్ల వ్యవస్థ సరిగ్గా లేదు. అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించట్లేదు. మా ప్రాంతం నుంచి ప్రభుత్వం పన్నులు వసూలు చేయట్లేదా? మా కాలనీకి రోడ్డు ఎందుకు నిర్మించరో అధికారులు చెప్పాలి. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాము. ఎన్ని సార్లు చెప్పినా అధికారుల్లో చలనం ఉండటం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి, మా కాలనీకి రహదారి కల్పించాలి. రహదారి సౌకర్యం లేకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నాము. అధికారులు స్పందించాలి.

జీఐ పైప్‌లైన్ ఏర్పాటుచేయాలి

ఆకుల పద్మ, స్థానికురాలు



51వ డివిజన్‌లో ఒక్క నాయబ్రాహ్మణ కాలనీ కొంత ఎత్తైన ప్రదేశంలో ఉంటుంది. ఇక్కడ వేసవి కాలంలో మాత్రం నీటి కొరత ఏర్పడుతుంది. ఇప్పటి వరకు పెద్దగా సమస్యలు లేకపోయినా తాగునీటి కొరత తీర్చేందుకు జీఐ పైపులైన్ నిర్మిస్తే వేసవిలో తాగు నీటికి ఇబ్బంది ఉండదు. ఈ ప్రాంతానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తే ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి మోడల్ డివిజన్‌గా రూపొందించాలి. జీఐ పైప్‌లైన్ ఏర్పాటు చేయడం వల్ల నీటి సమస్య తీరే అవకాశం ఉంది. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

సర్వజ్ఞ విద్యార్థినికి నాట్య శిరోమణి అవార్డు



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థిని పి.యోగ్యశ్రీకి నాట్య శిరోమణి అవార్డు అందిందని పాఠశాల డైరెక్టర్ ఆర్వీ నాగేంద్రకుమార్ తెలిపారు. ఇటీవల హైద్రాబాద్ భాస్కర్ ఆడిటోరియంలో సాంస్కృతిక, లలిత కళ సమఖ్య నిర్వహించిన 7వ జాతీయ నృత్య, సంగీత పోటీలలో నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న యోగ్యశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరచి నాట్య శిరోమణి అవార్డు అందుకుంది. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్న విద్యార్థినిని అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు, సాంస్కృతిక కళా రంగాల్లో విశేష ప్రతిభ చూపుతున్నారని డైరెక్టర్ అన్నారు.

మున్నేరు వంతెన వద్దకు సెగ్మెంట్ల తరలింపు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మున్నేరుపై తీగల వంతెన పనుల్లో భాగంగా శుక్రవారం సెగ్మెంట్ల తరలింపు చేపట్టారు. ఖమ్మం రూరల్ మండలం బారుగూడెం సమీపంలో సిద్ధం చేసిన సెగ్మెంట్లను కాల్వొడ్డు సమీపంలోని మున్నేరు వద్దకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీ వాహనం కాల్వొడ్డు సమీపానికి రావడతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే పనిలో పోలీసులు ఉండగా ప్రజలు మాత్రం ఆసక్తిగా చూశారు.

బదిలీ జరిగిన వారు వెళ్లాల్సిందే

వివాదాల నేపథ్యంలో విభాగాలను తనిఖీ చేసిన కమిషనర్ అభిషేక్



ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం అంతర్గత బదిలీల మేరకు స్థాన చలనం జరిగిన ఉద్యోగులు వారికి కేటాయించిన నూతన విభాగాలకు వెళ్లాలని కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశించారు. శుక్రవారం ఖ మ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని పలు విభాగాలను కమిషనర్ అభిషేక్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కేఎంసీకి నూతనంగా వచ్చిన వార్డు ఆఫీసర్లుకు గత వారం పలు విభాగాల్లో విధులు కేటాయించారు. అయితే గతంలో పనిచేసిన ఉద్యోగులు ఆయా స్థా నాల నుంచి ఇతర విభాగాలకు వెళ్లేందుకు ముందుకు రావటం లేదు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులకు కనీసం కుర్చీ కూడా ఇవ్వటం లేదు. ఐటీ విభాగంలో నూ తన ఉద్యోగులను ఏక వచనంతో పిలవటంతో గత మూడు రోజులుగా కేఎంసీలో కొత్త, పా త ఉద్యోగుల నడుమ వివాదంగా మారింది. విషయం తెలుసుకున్న కమిషనర్ పలు విభాగాలను పరిశీలించి బదిలీ జరిగిన ఉద్యోగులు వారి స్థానాలకు ఖచ్చితంగా వెళ్లాలని హెచ్చరించారు. నూతన ఉద్యోగులు కేఎంసీ మార్గదర్శకాలు, నిబంధనలు తెలుసుకొని పారదర్శకంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు.

బిల్లుల సెక్షన్‌కు ఇతరులు బంద్

ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గానికి, అధికారులకు తల నొప్పిగా మారిన కేఎంసీ ఇంజినీరింగ్ డ్రాయింగ్ విభాగంపై కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆంక్షలను విధించారు. రెండు వర్గాలుగా విడిపోయిన వర్క్ ఇన్స్‌పెక్టర్లుతో తరుచూ వివాదాలు ఏర్పడటంతో పాటుగా ఇతరులు ఇంజినీరింగ్ డ్రాయింగ్ విభాగంలోకి ప్రవేశించటం, ఉద్యోగులు ద్వారా వెళ్లాల్సిన ఫైల్స్‌ను కాంట్రాక్టర్లు నేరుగా ఉన్నతాధికారుల వద్దకు సంతకాలు తీసుకెళ్లటంపై కమిషనర్ కన్నెర్ర చేశారు. ఇంజనీరింగ్ డ్రాయింగ్ సెక్షన్‌కు ఇంజనీరింగ్ పర్యవేక్షణ అధికారులు మినహా ఇతరులు ఎవ్వరూ వెళ్లకూడదని నోటీసు బోర్డులో ఏర్పాటు చేశారు.

వాసవి భవన్‌ను అభివృద్ధి చేస్తా: మాటూరి

నేలకొండపల్లి,జనవరి31(ఆంధ్రజ్యోతి):సభ్యులు, దాతల సహాయ, సహకారాలతో వాసవీభవన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అధ్యక్షుడు మాటూరి సుబ్రమణ్యం అన్నారు. ఇటీవల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సుబ్రమణ్యం చేత శుక్రవారం వాసవీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో గెల్లా జగన్‌మోహన్ రావు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం పలువురు వైశ్య ప్రముఖులు సుబ్రమణ్యాన్ని అభినందించారు.

సామూహిక కుంకుమ పూజలు...

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నేలకొండపల్లి వాసవీభవన్‌లో మహిళలచే సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. తొలుత గో పూజ నిర్వహించారు.

మూడు రోజులు రూ.60 లక్షలు లక్ష్యం

50 మంది రెవెన్యూ సిబ్బందితో బృందాలు

అవగాహన కల్పిస్తూ ట్యాక్స్ వసూళ్లు

ఆదాయ వసూళ్లపై స్పెషల్ డ్రైవ్



ర్యాలీ నిర్వహిస్తున్న బిల్ కలెక్టర్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మున్నేరుకు వరదలు, ప్రజాపాలన, ఇందిరమ్మ సర్వే, రేషన్‌కార్డుల సర్వేల కారణంగా కేఎంసీలోని రెవెన్యూ విభాగం బిల్ కలెక్టర్లు గత నాల్గు నెలలుగా ఇతర పనులకు కేటాయించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేఎంసీకి ట్యాక్స్ కలెక్షన్ ద్వారా రూ.34.80 కోట్లు ఆదాయం లక్ష్యంగా ఉంది. కాని ఇప్పటి వరకు రూ.16.60 కోట్లు ఆదాయమే వసూళ్లు జరిగాయి. ఆదాయం రావాల్సిన వాటిలో కమర్షియల్ ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. దీంతో కమిషనర్ అభిషేక్ ఆగస్త్య బిల్ కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది మొత్తం 50మందితో రెండు బృందాలను ఏర్పాటు చేశారు. మూడు రోజులు పాటు ఖమ్మం నగరంలోని కమర్షియల్ ప్రాంతాల్లో ట్యాక్స్ కలెక్షన్ మాస్ క్యాంపియన్ నిర్వహించి రూ.60 లక్షలు ఆదాయ వసూళ్లు లక్ష్యంగా నిర్ణయించారు. శుక్రవారం కమాన్‌బజార్, కస్బాబజార్‌లో రెండు బృందాలు ఆదాయ వసూళ్ల డ్రైవ్ చేపట్టారు. శనివారం గాంధీచౌక్, పొట్టి శ్రీరాములు రోడ్డు, పంపింగ్ వెల్ రోడ్డు, గాంధీ గంజ్‌లో ట్యాక్స్ కలెక్షన్ జరగనుంది.

మాంట్ ఫోర్టులో డైమండ్ జూబ్లీ వేడుకలు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని మాంట్‌ఫోర్టు పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గుండాల కృష్ణ హజరై మాన్ ఫోర్టు విగ్రహనికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించి1964లో మెదటటి అడ్మిషన్ పొందిన పూర్వ విద్యార్థి సర్వదేవభట్ల శ్రీరామ్ మూర్తి పేరుపై పూర్వ విద్యార్థుల సంఘం కార్యాలయాన్ని ప్రారంబించి మాట్లాడారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక డ్రైవ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడిని నివారించే లక్ష్యంతో ముందస్తు ప్రణాళికలను అమలుచేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఈ పుష్పలత చెప్పారు. శుక్రవారం ఆమె జిల్లా పంచాయతీ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ , గ్రిడ్ అధికారులు, మండల ఎంపీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాబోయే వేసవికాలంలో దృష్టిలో ఉంచుకొని తీసుకోవాల్సిన చర్యలపై శనివారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి గ్రామపంచాయతీలో మంచినీటి సరఫరా మిషన్‌భగీరథ నీళ్ల సరఫరాపై క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ప్రతి వ్యక్తికీ కనీసం వంద లీటర్ల నీటిని అందించాలన్న లక్ష్యంతో నీటిసరఫరాను చేపట్టనున్నారు. ఎద్దడి ఉండే గ్రామాలను ముందస్తుగా గుర్తించి అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించనున్నారు. మిషన్ భగిరథ నీరు అందలేని గ్రామాల్లో ఉన్నటువంటి స్థానికంగా ఉన్న వనరులు గుర్తించనున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా సిద్ధం చేసి ఉండాలని సూచించారు. ఒకటి నుంచి పది వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో స్థితిగతుల ఆధారంగా మరమ్మత్తులు చేయడానికి కావలసిన అంచనాలు సిద్ధం చేసి, వాటికి కావలసిన నిధులను సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఏదైనా సమస్య ఉన్నట్టయితే టోల్ ఫ్రీ నెంబర్ 18005994007కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

బైపాస్ రోడ్డులో అక్రమణల తొలగింపు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం బైపాస్ రోడ్డులోని రహదారి అక్రమ నిర్మాణాలపై కేఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు దృష్టి సారించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బైపాస్ రోడ్డు వెంట గల బడ్డీ కొట్ల నుంచి బడా వ్యాపార సంస్థల వరకు గతంలోనే నోటీసులు జారీ చేశారు. వారు స్వచ్ఛందంగా ముందుకు రావటంతో శుక్రవారం కేఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు బలవంతంగా తొలగింపు చర్యలు చేపట్టారు.

రోడ్డును బాగు చేసి రైతుల కష్టాలు తీర్చండి

కొణిజర్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రైతులు నిరంతరం పొలాలకు వెళ్లే రహదారిని పట్టించుకోకుండా వదిలేయడంతో అధ్వాన్నంగా మారిందని, రైతులకు ఉపయోగపడే డొంక రోడ్డును పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జోనల్ కార్యదర్శి ఎం.రామారావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని తనికెళ్లలో రైతులు ఇబ్బంది పడుతున్న రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘ్ నాయకులు మందడపు రామారావు, బండారు సత్యనారాయణ, కవిడ మురళీక్రిష్ణ, మల్లంపాటి రమేష్, తుప్పతి మల్లిఖార్జున్, కవిడ రాంబాబు, తుప్పతి క్రిష్ణయ్య, కవిడ శ్రీను, ఎల్లయ్య, నాగేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

కొణిజర్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారని మిర్చి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కొణిజర్లలో తండు సోమయ్య అధ్యక్షతన జరిగిన రైతు సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, వెంపటి పరుశరాములు, నాగభూషణం, శీతరాములు, యాసా వెంకటేశ్వర్లు, దడిపినేని వెంకటేశ్వరరావు, నాగభూషణం, సుదర్శన్, వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు దళితులకు అందించాలి

ఖమ్మంరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను దళితులకు అందించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ కోరారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కేవీపీఎస్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిని వినతిపత్రాన్ని ఎంపీడీవో కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, ఉప్పలయ్య, వర కుమార్, ఉపేందర్,బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనచైర్మన్‌గా నియమితులైన యరగర్ల హనుమంతరావును శుక్రవారం తెలంగాణ యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నగరంలోని వ్యవసాయమార్కెట్‌లో చైర్మన్ చాంబర్‌లో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మ రోశయ్యయాదవ్, కోశాధికారి కొప్పుల నరసరావు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బారి మల్సూర్ యాదవ్, 30వ డివిజన్ కార్పొరేటర్ ముక్కల కమలయాదవ్, కోడి లింగయ్య యాదవ్, జడల మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సమాఖ్య నూతన ఒరవడి సృష్టిస్తుంది

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి31(ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల మాల విద్యార్థి సమాఖ్య ఆవిర్భావంతో తెలుగురాష్ట్రాల్లో నూతన ఒరవడి సృష్టిస్తుందని మాజీ ఎమ్మెల్సీ జూపుడి ప్రభాకర్ రావు అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రగతిశీల మాల విద్యార్థి సమాఖ్య ఆవిర్భావ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయపార్టీలకు విద్యార్థి సంఘాలున్నా జాతిని మేలుకొలిపే ప్రయత్నంలో భాగంగా ఈ ప్రగతిశీల మాల విద్యార్థి సమాఖ్య ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. ఈ సమాఖ్య ఒక్క తెలంగాణలోనే కాకుండా తెలుగు రాష్ట్రాలలో వారి సేవలు ఉపయోగపడాలని కోరారు. మాలజాతి ఔన్నత్యాన్ని వివరిస్తూ విద్యార్థి దశ నుంచే తెలుసుకొని జాతిలో గొప్పవ్యక్తులుగా పేరుపొందాలని తద్వారా సమాజానికి ఉపయోగకరంగా ఉండాలని తెలిపారు అనంతరం ప్రగతిశీల మాల సమాఖ్య కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు గండమల్ల చెన్నయ్య, సమతా సైనిక్‌దళ్ భారత దేశ ఉపాధ్యక్షుడు దిగంబర్ కాంబ్లీ, మాలమహానాడు ఉమ్మడి జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, పల్లా రాజశేఖర్, గుండేటి రమేష్, జంగం లక్ష్మణ్‌రావు, లింగాల రవికుమార్, మర్రి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో అలజడి

4వ వార్డు జవాన్ సస్పెన్షన్

మరి కొంతమంది ఉద్యోగులకు షోకాజ్‌లు

పలు కాంట్రాక్టు పనుల రద్దుకు ఆదేశాలు

చర్చనీయాంశమైన నిర్ణయాలు తీసుకున్న కమిషనర్



ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో ఒక్కసారిగా అలజడి నెలకొంది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పారిశుద్య కార్మికులు, జవాన్లపై వరసగా ఒకే రోజు గంటల వ్యవధిలోనే వేటు వేశారు. మరో వైపు పలు కారణాలతో కేఎంసీలోని పలు కాంట్రాక్టు పనులను రద్దు చేశారు. శుక్రవారం 4వ డివిజన్‌లో నిర్వహించిన పారిశుధ్య గ్యాంగ్ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జవాన్ వీ నాగుబాయ్‌ను విధుల నుంచి తొలగిస్తూ నియామకం చేసిన మహాత్మాగాంధీ పట్టణ ఫెడరేషన్‌కు కమిషనర్ ఆదేశాలు పంపారు. ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న పవన్, శ్రీనివాస్, శ్రీకాంత్ ముగ్గురిని తక్షణమే రెవెన్యూ విభాగానికి వెళ్లాలని ఆదేశించారు. పవన్, శ్రీకాంత్, శ్రీనివాస్‌లు కనీస బిల్లులు వసూళ్ల చేయకపోవటంతో విభాగాలను మార్పులు చేస్తూ సంబంధిత ఇంజనీరింగ్ అధికారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న కరుణాకర్ వీధి దీపాలు మార్చటంలో నిర్లక్ష్యంగా ఉండటంతో షోకాజ్ నోటీసు జారీ చేసి నూతన వార్డు ఆఫీసర్‌కు చార్జీ అప్పగించారు. కేఎంసీలోని అధికారుల వాహనాల నిర్వాహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహన బిల్లులను వెనక్కి పంపుతూ సదరు వాహన కాంట్రాక్టర్ కాంట్రాక్ట్‌ను రద్దు చేశారు. తర్వాత జాబితాలో ఉన్న వారికి పరిశీలన చేయాలని కమిషనర్ ఇంజనీరింగ్ ఈఈ కృష్ణలాల్‌ను ఆదేశించారు. అలాగే కార్యాలయ నిర్వాహణ సరిగా లేక పోవటం, ఉద్యోగులకు ఈపీఎఫ్ రూల్స్ ప్రకారం చెల్లించకపోవటంతో సదరు కాంట్రాక్ట్‌ను రద్దు చేసినట్లు ప్రకటించారు. కొత్త టెండర్ తీసుకోవాలని కమిషనర్ ప్రకటించారు. ఇలా వరస నిర్ణయాలతో ఖమ్మం నగర పాలక సంస్థలోని ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఉలిక్కిపాటుకు గురయ్యారు.



నిరుపయోగంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

» శిథిలమవుతున్న ఇళ్లు » పట్టించుకోని అధికారులు » మరమ్మతులు చేపట్టి పంపిణీ చేయాలని స్థానికుల వినతి

మధిర రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఇల్లూరు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిరుపయోగంగా మారాయి. ఈ గ్రామంలో 2018వ సంవత్సరంలో పేదలకు పంపిణీ చేసేందుకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 40డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేశారు. వీటిలో 20ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 17ఇళ్లను అసంపూర్తిగా నిర్మించి వదిలేయగా మూడింటిని అసలు ప్రారంభించలేదు. కొన్ని ఇళ్ల నిర్మాణంలో ఉన్న సమయంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాసిరకంగా చేయడంతో స్లాబ్‌ల పెచ్చులూడిపోయాయి. దీంతో ఆనాడు గ్రామస్థులు ఈ ఇళ్ల నిర్మాణం వద్ద నిరసన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. 20ఇళ్లు పూర్తయిన ప్రదేశం వద్ద చుట్టూ ముళ్లకంపచెట్లు పెరిగి ఆప్రాంతమంతా అడవిని తలపిస్తుంది. విషసర్పాలు వంటివి సంచరిస్తున్నాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల వద్ద కూడా అదే పరిస్థితి.



ఇల్లూరు గ్రామంలో కంపచెట్లతో నిండి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

గ్రామస్థులు అనేకమార్లు నిర్మాణం పూర్తయిన 20 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను గ్రామంలోని పేదలకు పంచాలని, అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. లక్షలాదిరూపాయలు ఖర్చుపెట్టి ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిధులన్నీ బూడిదలో పోసినట్లు అయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయని, ఈ ఇళ్లు అన్నింటినీ పేదలకు పంపిణీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సన్న బియ్యం పంపిణీ చేస్తాం

» గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల



సన్నరకం బియ్యాన్ని పరిశీలిస్తున్న రాయల నాగేశ్వరరావు

వైరా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డులోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు చెందిన గోదాముల్లోని సన్నరకం బియ్యాన్ని ఆసంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. గోదాముల్లో ఉన్న బియ్యం నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం త్వరలోనే రేషన్‌దుకాణాల ద్వారా కార్డుదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. గిడ్డంగుల సంస్థకు మిల్లర్లు అప్పగిస్తున్న బియ్యం నిల్వల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



పెన్షనర్స్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

వైరా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నూతన భవన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. డీఆర్‌లు, నగదు రహిత వైద్యం, పీఆర్సీ వంటి దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరగా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మండల, పట్టణ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, బొల్ల గంగారావు, చింతనిప్పు మాధవరావు, బీక్యా, గుగులోతు రాము, కట్ల సంతోష్, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్ రెడ్డి, షేక్.బీబా, పెన్షనర్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సత్యనారాయణ, టీవీ. కృష్ణయ్యసూరి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి 19వ మునిసిపల్ కమిషనర్‌గా నర్సింహ



సత్తుపల్లిరూరల్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపల్ 19వ నూతన కమిషనర్‌గా కొండ్రా నర్సింహ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సీడీఎంఏలో వెయిటింగ్‌లో ఉండగా సత్తుపల్లి మునిసిపాలిటీకి కమిషనర్‌గా వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన మందా రవిబాబు వనపర్తి జిల్లా అమరచింతకు బదిలీ అయ్యారు. ఆయన గతేడాది ఫిబ్రవరి 15వ తేదీన సత్తుపల్లిలో బాధ్యతలు స్వీకరించారు. ఏడాది తిరగకుండానే బదిలీపై వెళ్లిన రవిబాబు సాధారణ బదిలీల్లోనే వెళ్లాడని, రాజకీయంగా ఎటువంటి ఒత్తిడి లేదన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు కమిషనర్‌గా 18మంది పనిచేశారు.

మధిర మునిసిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



మొండితోక లత దంపతులను సన్మానిస్తున్న కేటీఆర్

మధిరటౌన్,జనవరి31(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ తాజా మాజీ చైర్‌పర్సన్ మొండితోక లత దంపతులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ మునిసిపల్ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. గత ఐదేళ్ల మునిసిపాలిటీలలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసి పట్టణాల స్వరూపాన్ని మార్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, జిల్లా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ పాల్గొన్నారు.

ముళ్లపాటి దంపతులకు...

వైరా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, విజయలక్ష్మీ దంపతులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్మానించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మునిసిపల్ పాలకవర్గాల్లోని మాజీ ప్రజాప్రతినిధులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. శుక్రవారం సీతరాములు దంపతులను కేటీఆర్ సన్మానించి జ్ఞాపికను బహూకరించారు.

ఫిబ్రవరి 7న బహిరంగ వేలం పాట

ఏన్కూరు, జనవరి31(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డ శ్రీలక్ష్మి నర్సింహస్వామి దేవాలయ ప్రాంగణం నందు లడ్డూ ప్రసాదం, పులిహోర విక్రయించేందుకు ఫిబ్రవరి 7న సోమవారం బహిరంగ వేలంపాటునిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్‌వీ డి. ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవాదాయ కమిషనర్ ఖమ్మం కార్యాలయం నందు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఆలయ ఈవోను సంప్రదిచాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాలి



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

» డీఎంహెచ్‌వో కళావతిబాయి

వైరా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో కళావతిబాయి అన్నారు. వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ దుర్గలతో కలిసి సందర్శించారు. ఫిబ్రవరి 13వరకు జరిగే కుష్టు వ్యాధి సర్వేపై చర్చించారు. సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి ప్రజలకు అందిస్తున్న సేవల గురించి చర్చించారు. మలేరియా, డెంగ్యూ, పైలేరియా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ తాతా ఉదయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం: సీఐటీయూ

తల్లాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు సీహెచ్.విఠల్‌రావు అన్నారు. శుక్రవారం తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, కార్పొరేట్ మతోన్మాద శక్తులను అభివృద్ధి చేసేందుకు దుర్మార్గపు చర్యలను అనుసరిస్తుందని ఆరోపించారు. కార్మిక వర్గంపై కక్ష గట్టి 44చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రమ్య, మండల కన్వీనర్ షేక్.మస్తాన్, ఐనాల రామలింగేశ్వరరావు, షేక్.జానీ, రమేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణయ్య, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లు, నవీన్, నర్సింహారావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బీమా చెక్కు అందజేత

సత్తుపల్లిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పించి వారి కుటుంబాలకు ధీమా, భరోసాను కల్పిస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని కిష్టారానికి చెందిన పిల్లి పీరయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నందున రూ.2లక్షల బీమాచెక్కును కుమారుడు లక్ష్మయ్యకు శుక్రవారం సత్తుపల్లిలో అందజేశారు. కాగా ఇదే కుటుంబంలో ఇద్దరికి రైతుబీమా కింద రూ.10లక్షలు, సభ్యత్వం కింద ఇద్దరికి ప్రమాద బీమాగా రూ.4లక్షల చొప్పున గతంలో అందజేశారు.

'కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి'

సత్తుపల్లిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన నోష్ ల్యాబ్స్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్వాహకులు పట్టణంలోని బాలికోన్నత పాఠశాలకు రూ.7లక్షల విలువైన ఫర్నీచర్‌ను శుక్రవారం వితరణ చేశారు. సహకారం అందించిన సంస్థ యాజమాన్యంతో పాటు సహకరించిన ఉపాధ్యాయురాలు చిట్టికుమారి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

శివరాత్రి జాతరను విజయవంతం చేయాలి

మధిరటౌన్, జనవరి31(ఆంధ్రజ్యోతి): మధిర మృత్యుంజయ స్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా జరిగే జాతరను విజయవంతం చేయాలని మధిర తహసీల్దార్ రాంబాబు, సీఐ మధు కోరారు. జాతర నిర్వహణ పై అన్ని శాఖల అధికారులతో శుక్రవారం ఆలయ ఈవో జగన్మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమన్వయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్ల పై సమీక్షిస్తు పలువురి సూచనలు సలహాలు స్వీకరించారు. జతరలో జాయింట్ వీల్ తదితర ఆట వస్తువులు ఏర్పాటుకు ఫిబ్రవరి 10వ తేదీన దేవాలయంలో వేలంపాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎస్‌ఐ సంధ్య, విద్యుత్ ఏఈ అనిల్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ పృధ్వీనాయక్, ఫైర్ ఆఫీసర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రంగానికి ప్రాధాన్యం: మువ్వా



భద్రయ్యను పరామర్శిస్తున్న మువ్వా

కల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సాగునీటి రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తుందని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. కల్లూరు మండలంలోని లింగాల గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అదే విధంగా మండల పరిధిలోని లింగాల గ్రామంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ సీనియర్ నాయకుడు మట్టూరి భద్రయ్యను, తాళ్ల వెంకటేశ్వరరావు, మద్దినేని నరసయ్య, పుల్లయ్యలను మువ్వా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మట్టూరి జనార్ధన్, ఏనుగు సత్యంబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, గండ్ర ఉపేందర్, మద్దినేని లోకేష్, మద్దినేని శ్రీను, యాసా వెంకటేశ్వరరావు, కాటేపల్లి కిరణ్, పారుపల్లి ఝాన్సీ, శీలం సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం

సత్తుపల్లిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి వాసవీక్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కోదండ రామాలయంలో సోమవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హాజరై కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సరాబు శివనాథ్ ప్రభు, గోళ్ల ప్రసాద్, అడపా రవికుమార్, కొత్తూరు రాజేశ్వరరావు, కోరుకొండ వెంకటేశ్వరరావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా నరేష్, గుడిమెట్ల రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లాడలో....

తల్లాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తల్లాడలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం మండల అధ్యక్షుడు నంబూరి మోహన్‌రావు, నేరెళ్ల చిన్నస్వామి, కేతేపల్లి భాస్కర్‌రావు, కొత్తూరు సతీష్, మిట్టపల్లి కృష్ణ, పసుమర్తి మురళీ, నంబూరి బాబు, బండారు నర్సింహారావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

కల్లూరులో....

కల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవి మాత ఆత్మర్పరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చందర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంకా రాంబాబు, అనుమోలు శ్రీనువాసరావు, సముద్రాల పుల్లారావు, దోసపాటి శ్రీనువాసరావు, పసుమర్తి రాఘవరావు, ఇమ్మడి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్, జనవరి31(ఆంధ్రజ్యోతి): వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మధిర పట్టణంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్, శ్రీనివాసరావు, సురేష్, కుసుమ, కళ్యాణి, లక్ష్మి, పల్లపోతు సుభద్రా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైరాలో...

వైరా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైరాలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవీమాత పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వర్తకసంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య కల్యాణమండపం అధ్యక్షుడు పెరుమాళ్ల కృష్ణమూర్తి, సెక్రటరీ నూకల శ్రీనివాసరావు, వాణిశ్రీ, మిట్టపల్లి కిరణ్, కొల్లా రాంబాబు, నూకల ప్రసాద్, నూకల అన్నపూర్ణ, వనమా మణికుమారి, రంగా వాసవీ, మిట్టపల్లి మహాలక్ష్మీ, మంజుల, రోజా తదితరులున్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

సత్తుపల్లిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించాలని ఉపాధి హామీ సిబ్బంది కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో, ఈసీ, ఈసీ, టీఏలు, సీవోలు సమావేశమై పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం తమకు వెంటనే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

కారేపల్లి, జనవరి31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉపాధిహామీలో పనిచేస్తున్న సిబ్బందికి గత మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించడంలేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో సురేందర్‌కు వినితిపత్రం అందజేశారు. రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ముందుగా పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వేతనాలు చెలించేంతవరకు ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈసీ సుధీర్, టెక్నికల్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పార్వతి, వసంత్, నాగేంద్రబాబు, ఖలీల్, అరుణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవోకు ఉద్యోగులు వినతిప్రతం సమర్పించారు. మూడునెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషన్ ప్రోగాం ఆఫీసర్ బి.కోటేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్లు ఎండీ.జలీల్‌ఖాన్, జి.నాగేశ్వరరావు, టెక్నీకల్, ఫీల్డ్ అసిస్టెంట్లు రజనీప్రియ, దేవమణి, ఎం.వీరబాబు, వర్మ పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి సిబ్బంది

వెండి, బంగారం చోరీ

సత్తుపల్లిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్‌లోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టిన దొంగలు వెండి, బంగారు ఆభరణాలు చోరీచేసిన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. కాలనీలోని పోతురాజు సుబ్రహ్మణ్యం అనారోగ్యానికి గురవ్వగా గురువారం ఖమ్మం ఆసుపత్రికి వెళ్లాడు. దీంతో ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితులు ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మిరప తోటను ధ్వంసం చేసిన దుండగులు

బోనకల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రి గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు మిరప తోటను ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన గుడిద వీరభద్రం ఎకరం భూమిని కౌలుకు తీసుకొని మిరప పంటను సాగు చేశాడు. కాపుదశలో ఉండగా మొక్కలను కొడవళ్లతో నరికి ధ్వంసం చేశారు. దాదాపు రూ.3 లక్షల పంట నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సంఘటన పై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

వరిగడ్డి వాములు దగ్ధం

మధిర రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మల్లారం గ్రామంలోని ఎస్సీకాలనీలో అరిగేల నాగరాజుకు చెందిన వరిగడ్డి వాము శుక్రవారం దగ్ధమైంది. గ్రామశివారులో నాగరాజుకు చెందిన వరిగడ్డి వాము ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని దగ్ధమైంది. ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రూ. 50వేల నష్టం సంభవించిందని బాధిత రైతు తెలిపాడు.

చిరునోములలో...

బోనకల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామంలో చాపల మడుగు రమేష్, చాపలమడుగు శ్రీనివాసరావులకు చెందిన 8 ఎకరాల్లోని వరిగడ్డి వాములను గురువారం అర్ధరాత్రి దుండగులు నిప్పంటించారు. దీంతో వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 60వేల నష్టం వాటిల్లింది. ఈ సంఘటన పై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

శివలింగాలకు పంచామృతాభిషేకం

ఏన్కూరు, జనవరి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకాలంపాడు ఆలయంలో పంచమవార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా లక్షాపదివేల శివలింగాలకు పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. శివునికి అభిషేకాలు నిర్వహించడం వల్ల ఈప్రాంత ప్రజలకు పాడి పంటలతో మంచి శుభం జరుగుతుందన్నారు. అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వడ్డే నరసింహారావు, మద్దినేని నవీన్, బోంతు సూర్య, చంద్రం, కార్తీక్, అనిల్, వెంకట్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

వైరా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వైరా మునిసిపాలిటీలో గురు, శుక్రవారాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు పర్యవేక్షణలో మునిసిపల్ సిబ్బంది వైరాలో జాతీయ ప్రధాన రహదారి, మధిర రోడ్డులో ఇబ్బడి ముబ్బడిగా పార్టీల వారు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

కల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు గాను ఎన్నికల కోడ్ అమలులోకి రావడంవతో కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పంచాయతీల కార్యదర్శిల పర్యవేక్షణలో సిబ్బంది కలిసి పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలిగించటం, విగ్రహాలకు ముసుగులు తొడగడం వంటి కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి చేపట్టారు. మండల పరిధిలోని పెద్దకోరుకొండి, పోచరవం, వెంకటాపురం, లింగాల, కల్లూరు, బత్తులపల్లి, పేరువంచ, చెన్నూరు ఫెక్సీలను తొలిగించారు.

మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

సత్తుపల్లిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఒకరికి బదులు మరొకరు హాల్‌టికెట్‌పై ఫొటో మార్చి పరీక్ష రాస్తుండగా పట్టుబడిన సంఘటన సత్తుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన బీఎడ్ ఫస్ట్ సెమ్ పరీక్షలు స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. కనపర్తి సాయికుమార్ హాల్‌టికెట్‌పై గుడిపూడు శ్రీనివాసరావు అనే వ్యక్తి తన ఫొటోతో పరీక్షా కేంద్రానికి హాజరై పరీక్ష రాస్తుండగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడినట్లు అధ్యాపకులు గమనించారు. ఈ విషయమై పోలీసులకు, కాకతీయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగానికి కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఫిర్యాదు చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రఘు తెలిపారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

» పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్

బోనకల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ నెల 4, 5 తేదీలలో భద్రాచలంలో జరగనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తుందన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పృథ్వీ, సందీప్, స్పందన, అనూష, అలేఖ్య, నవీన్, ప్రసాద్, యశ్వంత్, అనిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విజేతల ఎంపిక

సత్తుపల్లిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సత్తుపల్లి మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విజేతలకు ఎంఈవో నక్కా రాజేశ్వరరావు స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం బహుమతులను అందజేశారు. తెలుగు మీడియంలో పంతంగి లక్ష్మీప్రసన్న (రేజర్ల), ఎం.జాషువా (కాకర్లపల్లి), బీ.హిమబిందు, వీ.నాగసాయి చరణ్‌తేజ (సత్తుపల్లి), ఇంగ్లీషు మీడియంలో జీ.ఉమాసాయి (బాలికలు-సత్తుపల్లి), ఎం.జశ్విత (గంగారం), పీ.శ్రీహర్షిత (తుంబూరు)లు వరుసగా బహుమతులను గెలుచుకున్నారు. లక్ష్మీప్రసన్న, ఉమాసాయిలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు.

బోనస్ డబ్బులు వెంటనే జమ చేయాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు

వైరా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్నరకం వరిధాన్యం బోనస్ డబ్బులు వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరాలో శుక్రవారం శీలం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో రాంబాబు మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, నాయకులు తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, బాణాల వెంకట్రావమ్మ, కృష్ణమాచారి, గరిడేపల్లి సుబ్బారావు, రామాల పురుషోత్తం పాల్గొన్నారు.

సీట్‌బెల్ట్, హెల్మెట్ పునర్జన్మనిస్తుంది : ఎంవీఐ

సత్తుపల్లిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాణ సమయంలో సీట్ బెల్ట్, హెల్మెట్‌లు పునర్జన్మను ఇస్తాయని, అలాగే తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సత్తుపల్లి ఎంవీఐ జొన్నలగడ్డ శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పట్టణంలో విద్యార్థులు, పోలీస్, బెటాలియన్, ఆర్టీసీ అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రఘు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా నగదు అందజేత

కల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో తపాలశాఖ తరుపున చిన్నాల త్రివేణి కుటుంబానికి రూ.1.15 లక్షల బీమా నగదును సత్తుపల్లి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి. రాజేష్ శుక్రవారం అందజేశారు. మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన త్రివేణి తపాలశాఖలో జీవిత బీమాను రూ. 1 లక్షకు తీసుకొని రూ.11 వేలు ప్రీమియంగా చెల్లించారు. ఇటీవల గుండెపోటుతో ఆమె మృతి చెందింది. దీంతో ప్రీమియంగా చెల్లించిన నగదుకు బీమా, బోనస్ కలిసి నామిని అయిన భర్త చిన్నాల అశోక్‌కు తపాలశాఖ తరుపున నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం రామకృష్ణ, ఎంవో రాజు, బీపీఎం కోమలి, హరికృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

వేంసూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం వెంకటాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు